PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 62 | పేజీలు : 8 | బుధవారం 29 జూలై 2026 | వెల : 4/-

PRGI.NO.TGTEL/26/A2002

నవగీతం

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

నవగీతం తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాలో నియోజకవర్గ ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి.

Cell: +919912484184

Email: navageetamnews@gamil.com

Website: www.navageetam.com

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు హైడ్రామా

- శాఖ మార్పునకు కేంద్రం ప్రతిపాదన
- ప్రచారాన్ని ఖండించిన బీజేపీ
- మొదట ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్చేందుకు కేంద్రం సిద్ధమైందని సమాచారం
- రాజీనామా తప్ప మరో ప్రత్యామ్నాయం అంగీకరించబోమన్న సీజేపీ ప్రతినిధులు
- ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇది
- ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదు



## 'పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు కపట నాటకం

- ఆక్రమణలు, దారుణాల్ని కప్పిపుచ్చే డ్రామా'
- పాకిస్థాన్‌పై భారత్ మరోసారి తీవ్ర ఆగ్రహం
- పీఓకేలో స్థానిక సంస్థల ఎన్నికలు అక్రమ ఆక్రమణల్ని దాచే ప్రయత్నమేనని విదేశాంగ శాఖ విమర్శలు
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సహా పాక్ ఆక్రమించిన ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం



## రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ
# ఇబ్బందులు పడకూడదు




- సీడ్ కంపెనీలు గానీ, ఆర్గనైజర్లు గానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకూడదు
- పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులను వెంటనే ప్రారంభించి రైతులకు సకాలంలో అందేలా కార్యాచరణ చేపట్టాలి
- రైతుల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సంబంధిత కంపెనీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా వెనుకాడబోదు



## ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

- ఆయనకు విద్యాశాఖ బాధ్యతలు కట్టబెట్టడం దారుణం
- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ విమర్శ
- బీజేపీ ఒక అత్యాచార దోషుల రక్షకుడిని మంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది.
- "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది
- దానిని నాశనం చేయడం పాపం
- ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే జవాబుదారీతనంల

## విద్యా హక్కులపై కేంద్రం ఆధిపత్యం
# సరికాదు

- ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది 'మా విచక్షణాధికారం'
- దానిని ఎవరూ లాక్కోలేరు: ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ విషయంలో హైకోర్టు ఉత్తర్వులను సమీక్షించి చట్టబద్ధంగా ముందుకెళ్తాం
- కోర్టుల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటాం
- కబ్జాదారులే కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు
- దురుద్దేశపూర్వకంగా ధిక్కరణ కేసులు వేస్తున్నారు
- డబ్బులు ఖర్చు పెట్టి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు
- మేము తీసుకువచ్చిన అతి పెద్ద సంస్కరణ హైడ్రా



**న్యూఢిల్లీ**

ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వానికి ఉండే విచక్షణాధికారం. దానిని ఎవరూ లాక్కోలేరు. గతంలో సీఎస్‌గా పనిచేసిన సోమేశ్‌కుమార్‌పై 400 కంటెంప్ట్ కేసులు ఉన్నాయి. న్యాయస్థానాలపై మాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ విషయంలో హైకోర్టు ఉత్తర్వులను సమీక్షించి చట్టబద్ధంగా ముందుకు వెళ్తాం.. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన అత్యంత గొప్ప సంస్కరణ 'హైడ్రా' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. - మిగతా3లో



## ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్
# చెల్లిస్తాం

- ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపణ
- కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తామని వెల్లడి
- గ్లోబరీనా వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్**

ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ,, ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ వల్ల సమస్యలు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్? చేశారు. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోందని, యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు. విద్య, వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయని తెలిపారు. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై ఆలోచిస్తామని సీఎం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామని, రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. - మిగతా3లో



## బ్లాక్‌మెయిల్ కోసమే
# హైడ్రా

- రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్
- హైడ్రా కమిషనర్‌గా ఏవీ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు
- హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు
- హైడ్రా పేరుతో ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ
- కాంగ్రెస్ నేతల నివాసాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్న

**హైదరాబాద్**

హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రం రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ - మిగతా3లో

## జనసంద్రమైన సింహాచలం..

- వేడుకగా 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ
- ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం
- అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం
- 10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా
- భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ



నవగీతం
తెలుగు దినపత్రిక
బుధవారం
29 జూలై 2026

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు హైడ్రామా

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంతో ప్రారంభమైన ఆందోళనలు, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీశాయి. అయితే మొదట ధర్మేంద్ర ప్రధాన్? రాజీనామాకు కంటే ముందు ఆయనను వేరే శాఖకు మార్చాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రశ్నపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులతో జరిపిన తొలి చర్చల్లో కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్? శాఖను మాత్రమే మార్చే ప్రతిపాదనను చేసిందని సమాచారం. అయితే ఆ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు పూర్తిగా తిరస్కరించినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను బీజేపీ ఖండించింది. అవి పూర్తిగా నిరాధారమైనవని, కల్పితమైనవని పేర్కొంది.

ఈ అంశంపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇదన్నారు. ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదని చెప్పారు. ఇవన్నీ నిరాధార కథనాలేనని కొట్టిపారేశారు. కేవలం సంచలనాల కోసం ఇలాంటి అసత్య వార్తలను వ్యాప్తి చేయవద్దని హితవు పలికారు.

దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చింది. సీజేపీ ప్రతినిధులతో సమావేశమైన కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్? పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్?ను విద్యాశాఖ నుంచి మరో మంత్రిత్వ శాఖకు మార్చే అవకాశాన్ని ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థుల ఆందోళనలు తగ్గుతాయని



కేంద్రం భావించినట్లు సమాచారం. అయితే ప్రభుత్వ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు తిరస్కరించినట్లు తెలుస్తోంది. విద్యాశాఖ నుంచి బదిలీ చేయడం సమస్యకు పరిష్కారం కాదని, మంత్రి పదవి నుంచి పూర్తిగా తప్పుకోవడమే ప్రజలకు సరైన సందేశమని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. ధర్మేంద్ర ప్రధాన్ ప్రభుత్వంలో కొనసాగితే ఉద్యమ లక్ష్యం నెరవేరదని, అందువల్ల రాజీనామా ఒక్కటే తమ డిమాండ్ అని చర్చల సందర్భంగా వెల్లడించినట్లు తెలిసింది.

**ఉద్యమకారుల్లో వ్యతిరేకత వస్తుందనే ఆందోళన**

చర్చల సందర్భంగా మంత్రివర్గంలో ఎవరు కొనసాగాలి? ఎవరికీ ఏ శాఖ కేటాయించాలన్నది పూర్తిగా ప్రధానమంత్రి అధికార పరిధిలోని అంశమని కేంద్ర ప్రతినిధులు సీజేపీకి వివరించినట్లు సమాచారం. అయినప్పటికీ, ఉద్యమకారులు తమ డిమాండ్‌లో ఎలాంటి మార్పు చేయడానికి సిద్ధంగా లేరని తెలుస్తోంది. శాఖ మార్పు కంటే మంత్రి పదవి నుంచి తప్పుకోవడమే మేలని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. సీజేపీ చర్చల బృందం ప్రభుత్వ ప్రతిపాదనను అంగీకరిస్తే ఉద్యమంలో పాల్గొంటున్న విద్యార్థులు, మద్దతుదారుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశముందని వారు భావించినట్లు సమాచారం. అందుకే ఎలాంటి రాజీకి వెళ్లకుండా రాజీనామా డిమాండ్‌పైనే నిలబడినట్లు తెలుస్తోంది. ఉద్యమ లక్ష్యం నుంచి వెనక్కి తగ్గినట్లు సంకేతాలు వెళ్లకూడదనే ఉద్దేశంతో తమ వైఖరిని మార్చలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**రాజీనామా తర్వాత ముగిసిన ఆందోళన**

మూడో విడత చర్చలకు కొన్ని గంటల ముందే ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం సీజేపీ తమ నిరసన కార్యక్రమాలను విరమిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో గత కొన్ని వారాలుగా కొనసాగిన ఆందోళనలకు తాత్కాలికంగా తెరపడింది. రాజీనామా అనంతరం కేంద్ర ప్రభుత్వం, సీజేపీ మధ్య ఉద్రిక్తతలు కూడా తగ్గుముఖం పట్టాయి.

**రాహుల్ గాంధీ కూడా అదే డిమాండ్**

ఈ వివాదం సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్? శాఖను మార్చే ప్రయత్నాలు కేంద్రం చేస్తోందని ప్రతిపక్షాలు కూడా విమర్శించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్పు సరిపోదని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలకు న్యాయం జరగాలంటే మంత్రి పదవి నుంచి పూర్తిగా తప్పుకోవాల్సిందేనని ఆయన పలుమార్లు పేర్కొన్నారు. కేవలం శాఖను మార్చడం ద్వారా సమస్య ముగిసిపోదని, బాధ్యతను నిర్ధారించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలన్నింటితో కేంద్ర ప్రభుత్వం తొలుత శాఖ మార్పు ద్వారా వివాదాన్ని చల్లార్చే ప్రయత్నం చేసింది. కానీ సీజేపీ మాత్రం పట్టుబట్టడంతో రాజీనామా తప్పలేదు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు కపట నాటకం

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీఓకే) జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇవి ప్రజాస్వామ్య ఎన్నికలు కావని, పాకిస్థాన్ తన అక్రమ ఆక్రమణల్ని ప్రపంచం నుంచి దాచిపెట్టేందుకు, దృష్టి మరల్చేందుకు ఆడుతున్న కపట నాటకమని భారత్ ఎండగట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలతో సహా జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు మొత్తం భూభాగం భారతదేశంలో అంతర్భాగమేనని మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ వైఖరి ఎప్పటికీ మారలేదని, అదే తమ విధానం అని పేర్కొన్నారు. పీఓకేలో ప్రజాస్వామ్యం అమలవుతోందనే భావన కల్పించడానికి మాత్రమే ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారని అన్నారు. వాస్తవానికి ఆ ప్రాంతంలో పాకిస్థాన్ అక్రమ ఆక్రమణ కొనసాగుతోందని, అక్కడి ప్రజలపై తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ దారుణాల నుంచి ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నమే ఎన్నికల నిర్వహణ అని జైస్వాల్ విమర్శించారు.

'పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌లో ఇటీవల పెద్ద ఎత్తున జరుగుతున్న నిరసనలు కూడా అక్కడి ప్రజల అసంతృప్తికి నిదర్శనం. పాకిస్థాన్ ఆర్థిక దోపిడీకి పాల్పడటం, ప్రజల ప్రాథమిక హక్కుల్ని కాలరాయడం, పరిపాలనా అణచివేత కారణంగానే ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. ఎన్నికల పేరుతో ఈ వాస్తవాల్ని ప్రపంచానికి కనిపించకుండా చేయాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది.'

**భారత నాగరిక వారసత్వంపై పాక్‌కు హక్కులేదు!**

ఈ సందర్భంగా మరోసారి సింధు జలాల ఒప్పందం అంశంపైనా స్పందించారు జైస్వాల్. ఉమ్మడి సింధు లోయ



నాగరికత తమది కూడా అని కొందరు పాకిస్థాన్ నిపుణులు చేస్తున్న వ్యాఖ్యల్ని ఆయన ఖండించారు. దశాబ్దాలుగా సరిహద్దు బయట ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, హింసకు మద్దతు ఇస్తున్న దేశానికి భారత నాగరిక, సాంస్కృతిక వారసత్వంపై హక్కు లేదని స్పష్టం చేశారు. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత భారత్, సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది.

దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పాకిస్థాన్ నుంచి సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలపైనా జైస్వాల్ స్పందించారు. పాకిస్థాన్ దశాబ్దాలుగా భారత్‌పై సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందని, ఆ దేశం వాస్తం స్వరూపం భారత యువతకు బాగా తెలుసని అన్నారు. భారత యువతతో పాటు కొత్త తరం కూడా పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న సరిహద్దు ఉగ్రవాదానికి పూర్తిగా ముగింపు పలకాలని కోరుకుంటోందని ఆయన చెప్పారు. పాకిస్థాన్ ప్రజలు, అక్కడి నాయకత్వం కూడా ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదని చురకలంటించారు.

**సార్క్ సహకారాన్ని అడ్డుకుంటుంది పాకిస్థానే!**

ఇదే సమయంలో దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడానికి పాకిస్థానే ప్రధాన కారణమని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ప్రాంతీయ సహకారాన్ని భారత్ ఎప్పటి నుంచో సమర్థిస్తోందని, అయితే సార్క్ ముందుకు సాగకుండా అడ్డుకుంటున్న దేశం ఏదో దక్షిణాసియాలోని ప్రతి ఒక్కరికీ తెలుసని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఇటీవల సార్క్‌ను తిరిగి చురుగ్గా మార్చాలని, సభ్య దేశాల మధ్య విభేదాల్ని చర్చల ద్వారా పరిష్కరించాలని చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ రణధీర్ జైస్వాల్ ఇలా అన్నారు. ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేసేందుకు భారత్ దశాబ్దాలుగా నిరంతర కృషి అందిస్తోందన్నారు. సార్క్‌లో భారత్, అఫ్గానిస్థాన్, భూటాన్, బంగ్లాదేశ్, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక సభ్య దేశాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక, అభివృద్ధి సహకారాన్ని పెంచే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తుంది. 2014లో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలో జరిగిన సార్క్ శిఖరాగ్ర సమావేశం తర్వాత ఈ సంస్థ కార్యకలాపాలు పెద్దగా ముందుకు సాగలేదు. 2016లో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన సార్క్ సదస్సు కూడా రద్దయింది. ఆ ఏడాది సెప్టెంబరులో జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో భారత సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్ ఆ సమావేశానికి హాజరు కాలేమని ప్రకటించింది. తర్వాత బంగ్లాదేశ్, భూటాన్, అఫ్గానిస్థాన్ కూడా ఇస్లామాబాద్ సమావేశాన్ని బహిష్కరించడంతో సదస్సు పూర్తిగా రద్దయింది.

# ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు అని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అలాంటి వ్యక్తికి విద్యాశాఖ మంత్రి బాధ్యతలు కట్టబెట్టడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ తెలిపారు. అత్యాచార దోషులను సమర్థించే వ్యక్తి విద్యా శాఖ మంత్రిగా ఉండేందుకు ఎంత మాత్రం అర్హుడు కాదన్నారు.

"విద్యావ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తూ యువత ఆందోళనలు చేపట్టారు. ఎంతో మంది యువతులు నిరసనల్లో పాల్గొన్నారు. కానీ, వారిని దారుణంగా కొట్టారు, చిత్రహింసలకు గురిచేశారు. బీజేపీ ఒక అత్యాచార దోషుల రక్షకుడిని మంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది. అత్యాచార దోషులకు రక్షణ కల్పించాలనే వాడి కంటే నైతికత లేని వ్యక్తి మరొకరు ఉండరు. ఇప్పుడు అతనే దేశ విద్యాశాఖ మంత్రి. ఈ విషయంలో ప్రధాని స్పందన చాలా వింతగా ఉంది. ఆయన కేబినెట్‌లో ఎంతో మంది మంత్రులు ఉన్నారు. వారిలో ఎవరికైనా ఈ పదవికి అప్పగించిఉండొచ్చు. కానీ ఆయన మాత్రం అత్యాచార దోషులను కాపాడే వ్యక్తినే ఎంచుకున్నారు."

ఇదిలా ఉండగా, పేపర్ లీక్, ఇతర అక్రమాలకు వ్యతిరేకంగా పరీక్షా విధానంలో తీసుకొచ్చిన కఠినమైన చట్టాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళల హక్కులు, మహిళా రిజర్వేషన్లు, మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే, మరోవైపు ఇలాంటి వారిని మంత్రిని చేయడం సమాజంలో మహిళల భద్రతకు చాలా తప్పుడు సంకేతాలను పంపుతుందని ఆమె ఆరోపించారు. అయితే, లోక్?సభలో ప్రియాంక చేసిన వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో కొద్దిసేపు గందర



గోళం నెలకొంది. ప్రహ్లాద్ జోషికి సంబంధించిన వీడియో తమ వద్ద ఉందని, తాను మాట్లాడిన ప్రతి మాటకూ కచ్చితమైన ఆధారాలు సమర్పిస్తానని ప్రియాంక స్పష్టం చేశారు.

**మన దేశ రాజ్యాంగం గొప్పది!**

అంతకుముందు, వేలాది మంది యువకులు తమ గళాన్ని వినిపించడానికి, ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం కోరడానికి శాంతియుతంగా వీధుల్లోకి వచ్చారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులు వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని, కష్టపడటం కంటే నిజాయతీగా ఉండకపోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఉందని భావించడం మొదలుపెట్టారని ఆమె ఆరోపించారు. "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది. దానిని నాశనం చేయడం పాపం. ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే జవాబుదారీతనం. మనకు అధికారం ఇచ్చి ఇక్కడికి వచ్చాక, మనం చేసే ప్రతి పని వారి సంక్షేమం కోసమే ఉండాలనేది వారి ఏకైక ఆకాంక్ష. ఒకవేళ వారికి అన్యాయం జరిగితే, మనం వారికి జవాబుదారీగా ఉండి, వారికి న్యాయం జరిగేలా

## జనసంద్రమైన సింహాచలం..

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

## ఫేస్‌బుక్, గూగుల్, ఎక్స్‌లకు కేంద్రం సమన్లు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణ, వినియోగదారుల గోప్యత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్), గూగుల్, ఎక్స్, స్నాప్‌చాట్ వంటి దిగ్గజ సంస్థలకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమన్లు జారీ చేసింది. ఆగస్టు 3న నిర్వహించనున్న పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరై, సంబంధిత అంశాలపై వివరణ ఇవ్వాలని సోషల్ మీడియా ప్రతినిధులను ఆదేశించింది. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సమావేశానికి టెక్ కంపెనీల ప్రతినిధులతో పాటు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మరియు హోం మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరై కమిటీకి వివరాలు సమర్పిస్తారని ఆయన తెలిపారు. ప్రజల, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, రైతుల సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి భరోసా కల్పిస్తున్నారో వివరించాలని కంపెనీలను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవల పరీక్ష పత్రాల లీకేజీ, సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన వీడియోను ఫేస్‌బుక్ కొద్దిసేపు తొలగించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సాంకేతిక లోపం వల్లే ఈ పొరపాటు జరిగిందని మెటా వివరణ ఇచ్చింది. ఈ వివాదం మరియు విద్యార్థుల నిరసనల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంపై విస్తృత చర్చ జరుగుతున్న తరుణంలో పార్లమెంటరీ కమిటీ సమన్లు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కృత్రిమ సూర్యుడి దిశగా చైనా..

అపరిమితమైన, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు'



ప్రాజెక్టులో చైనా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అణు సంలీన రియాక్టర్ కోసం రూపొందించిన ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ మాగ్నెట్‌ను చైనా శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. భవిష్యత్తులో ఫ్యూజన్ ఎనర్జీని సాధించే దిశగా ఇది అత్యంత కీలకమైన ఇంజినీరింగ్ విజయమని నిపుణులు అభివర్ణిస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ (ఏఎస్ఐపీపీ) శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన టోరాయిడల్ ఫీల్డ్ మాగ్నెట్, హై-టెంపరేచర్ సూపర్ కండక్టింగ్ సెంట్రల్ సోలనోయిడ్ కాయిల్ వ్యవస్థలు అన్ని పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించినట్లు వారు ప్రకటించారు. సుమారు 582 టన్నుల బరువున్న ఈ భారీ మాగ్నెట్‌ను 'డీ' ఆకారంలో నిర్మించారు. దీని తయారీకి అవసరమైన కీలక పదార్థాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం వరకు అన్నింటినీ చైనా దేశీయంగానే సమకూర్చుకోవడం విశేషం. అణు సంలీన ప్రక్రియలో భాగంగా, సూర్యుడి కేంద్ర భాగం కంటే కొన్ని రెట్లు అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్లాస్మాను సృష్టిస్తారు. ఈ అత్యధిక ఉష్ణోగ్రత రియాక్టర్ గోడలను తాకకుండా, శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రంలో బంధించేందుకు ఈ భారీ మాగ్నెట్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. హైడ్రోజన్ ఐసోటోప్‌లను సంలీనం చేయడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేసే ఈ విధానం, భవిష్యత్తులో కర్బన రహిత విద్యుత్ ఉత్పత్తికి మార్గం సుగమం చేస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైనప్పటికీ, వాణిజ్య స్థాయిలో ఫ్యూజన్ విద్యుత్‌ను నిరంతరాయంగా ఉత్పత్తి చేయడం అంతర్జాతీయ శాస్త్రవేత్తలకు ఇప్పటికీ సవాలుగానే ఉంది. అయితే, తన ఇంధన మరియు సాంకేతిక లక్ష్యాల సాధనలో భాగంగా చైనా ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వేగంగా ముందుకు సాగుతోందని ఈ తాజా పరిణామం స్పష్టం చేస్తోంది.

## సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష

ఆన్‌లైన్ మోసాలను (సైబర్ స్కామ్స్) అరికట్టే దిశగా మయన్మార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలను బలవంతంగా హింసించి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా చేస్తున్న నేరగాళ్లకు మరణశిక్ష విధించేలా రూపొందించిన కొత్త చట్టానికి ఆమోదం తెలిపింది. రాజధాని నైప్యిడాలో జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో 'యాంటీ-ఆన్‌లైన్ స్కామ్ బిల్లు'కు ఆమోదం లభించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ నూతన చట్టం ప్రకారం, ఉద్యోగాల పేరుతో ప్రజలను కిడ్నాప్ చేసి, వేధింపులకు గురిచేస్తూ బలవంతంగా ఆన్‌లైన్ నేరాలకు పాల్పడేలా చేసే వారికి 10 ఏళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ క్రమంలో బాధితులు ఎవరైనా మరణిస్తే, బాధ్యులైన నిందితులకు మరణశిక్ష విధించేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. వీటితో పాటు స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు, డిజిటల్ లేదా క్రిప్టోకరెన్సీ మోసాలకు పాల్పడే వారికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష పడేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత ఘర్షణలను ఆసరాగా చేసుకుని సైబర్ నేర కేంద్రాలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఆగ్నేయాసియా అంతటా విస్తరించిన ఈ నెట్‌వర్క్, పెట్టుబడులు, హనీ ట్రాప్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతోంది. కొందరు స్వచ్ఛందంగానే ఈ ముఠాలలో చేరుతుండగా, మెజారిటీ విదేశీయులను ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో అక్రమంగా తరలించి, వారిని బందీలుగా మార్చి బలవంతంగా ఈ అరాచకాలకు ఒడిగడుతున్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది యువత ఉద్యోగాల వేటలో మయన్మార్ వెళ్లి, అక్కడ స్కామ్ కేంద్రాల్లో బందీలుగా చిక్కుకున్నట్లు అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో, సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు ప్రస్తుత సైనిక మద్దతుగల ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కఠిన చట్టం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# విద్యా హక్కులపై కేంద్రం ఆధిపత్యం సరికాదు

-మొదటిపేజీ తరువాయి

చెరువులు, కుంటలను కాపాడేందుకు చేపట్టిన ఈ వ్యవస్థను కొనసాగించి తీరతామని తేల్చి చెప్పారు. హైడ్రా విషయంలో కోర్టుల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారే న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ దురుద్దేశపూర్వకంగా కోర్టు ధిక్కరణ (కంటెంప్ట్) కేసులు వేస్తున్నారని సీఎం మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలోని కృషి భవన్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

**ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా?**

'చెరువులు, నాలాలను కాపాడటంలో హైడ్రా తన విధులు నిర్వర్తిస్తున్న తీరుపై ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉంది. ఎన్ కన్వెన్షన్, గండిపేట, బతుకమ్మ కుంటల్లో ఆక్రమణలు తొలగిస్తే అవి పేదలవంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? బతుకమ్మ కుంటను బీఆర్‌ఎస్ వాళ్లు కబ్జా పెట్టుకున్నారు. దానిపై కూడా కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసు వేశారు. కబ్జాదారులు డబ్బులు ఖర్చు పెట్టి సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. చెరువులను ఆక్రమించిన వారు ధనవంతులైనా, పేదలైనా చర్యలు తప్పవు.

**గత 12 ఏళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు..**

'గడిచిన 12 ఏళ్లలో తెలంగాణకు ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదు. రాష్ట్రంలోని 11.56 లక్షల మంది అర్హులైన పేదల కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై (జీ)2.0) కింద ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశాం. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, త్వరలోనే ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉపాధి హామీ నిధుల విడుదల, ఎల్ నినో వల్ల ఏర్పడిన కరువు పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర బృందాలను పంపాలని విజ్ఞప్తి చేశాం..' అని రేవంత్ తెలిపారు.

**విద్యా హక్కులపై కేంద్రం ఆధిపత్యం సరికాదు..**



'పరీక్షల నిర్వహణ, లీకేజీల నిరోధానికి దేశస్థాయిలో పకడ్బందీ విధానం ఉండాలి. నిబంధనలు పట్టించుకోని కోచింగ్ సెంటర్లే ప్రశ్నపత్రాల లీకేజీలకు వేదికలుగా మారుతున్నాయి. విద్యకు సంబంధించి రాష్ట్రాల పరిధిలో ఉన్న అధికారాలను కేంద్రం లాక్కోవాలని చూడటం వల్లే గందరగోళం ఏర్పడుతోంది. నీట్ సహా ఇతర పరీక్షల విషయంలో యూనివర్సిటీలపై ఆధిపత్య ధోరణి వీడాలి. ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవు. ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయి. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సి ఉంది. సభలో చర్చ జరిగితే రాహుల్‌గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారు..' అని సీఎం అన్నారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పకడ్బందీ ప్రణాళిక**

'గత కేసీఆర్ ప్రభుత్వం రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి పారిపోయింది. ప్రతి ఏటా రూ.2,200 కోట్ల నుంచి రూ.2,400 కోట్లు ఇందుకు అవసరమవుతాయి. ఇకపై ఏ సంవత్సరం బకాయిలు ఆ సంవత్సరమే చెల్లించేలా, అడ్వాన్స్‌గా బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో..కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య 100% ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో ఆ మేరకు డిమాండ్ చేస్తే బాగుంటుంది..' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, సురేష్ షెట్కార్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

# మా దగ్గర తీసుకున్న కమీషన్ ఇచ్చేయండి

ఒకే పనికి రెండుసార్లు బిల్లులు చెల్లించిన అధికారులకు ఇప్పుడు కాంట్రాక్టర్లు ఝలక్ ఇస్తున్నారు. అవినీతి జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో అడ్డదారిలో వెళ్లిన ప్రజా ధనాన్ని రికవరీ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. అయితే రెండో బిల్లులో తీసుకున్న 10 శాతం కమీషన్ డబ్బును అధికారులూ తిరిగివ్వాలని కాంట్రాక్టర్లు పట్టుబడుతున్నారు. అలాగే జీహెచ్?ఎంసీ అడుగుతున్న వడ్డీ డబ్బును చెల్లించలేమని చెబుతున్నారు.

**బల్దియా చరిత్రలో మొదటిసారి**

కమీషన్, వడ్డీ డబ్బుతో కాంట్రాక్టర్లు రికవరీ ప్రక్రియపై మెలిక పెట్టడంతో శాఖాపరమైన చర్యల పేరుతో ఫైనాన్స్ విభాగం 78 మంది లైసెన్సులను హోల్డ్?లో పెట్టింది. ఆయా కాంట్రాక్టర్లకు ఇకపై జీహెచ్ఎంసీ ద్వారా బిల్లుల చెల్లింపు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంది. జీహెచ్?ఎంసీ చరిత్రలో ఇంత మంది కాంట్రాక్టర్లపై ఒకేసారి చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

**కమిషనర్ లేఖలతో**

అనారోగ్యం, తమ పిల్లల వివాహం, ఇతరత్రా అత్యవసర కారణాలు చూపుతూ తమకు వెంటనే బిల్లులు చెల్లించాలని అభ్యర్థిస్తూ కొందరు గుత్తేదారులు జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్??కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. దీంతో కొన్నింటిని కమిషనర్ పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో ఆయా గుత్తేదారులకే రెండుసార్లు వర్క్? బిల్లుల చెల్లింపు జరిగింది. దీనికి కారణం కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటమేనని తెలుస్తోంది.

ఏళ్లకు ఏళ్లుగా ఫైనాన్స్ విభాగంలో పని చేస్తోన్న పొరుగు సేవల సిబ్బంది కమిషనర్ సిఫార్సును సొమ్ము చేసుకున్నాడు. కమిషనర్ సిఫార్సు లేఖతో కాంట్రాక్టర్ బిల్లును చెల్లింపునకు పంపించి, ఆయా కాంట్రాక్టర్ల బిల్లులను వరుస క్రమంలోనూ కొనసాగించారు. ఫైనాన్స్ విభాగం సలహాదారు, అదనపు కమిషనర్, కమిషనర్ కూడా రెండు బిల్లులకు గుడ్డిగా




ఆమోదం తెలిపారు. దాంతో ఒక్కో కాంట్రాక్టరుకు రెండుసార్లు నగదు ట్రాన్స్?ఫర్ అయ్యింది.

**మొత్తం ఆపరేటరే చేశాడు!**

కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాలో రెండోసారి బిల్లుకు సంబంధించిన డబ్బులు జమ కాగానే కొందరు కాంట్రాక్టర్లు ఫైనాన్స్ విభాగానికి సమాచారం ఇచ్చారు. కానీ 10 శాతం కమీషన్ తీసుకున్న కంప్యూటర్ ఆపరేటర్, మీకేం కాదంటూ వారికి బదులు సమాధానం ఇచ్చాడు. అధికారులకు సైతం కమీషన్‌లో వాటాలు పంచాడు. ఈ విషయంలో చివరకు న్యాయపరమైన చిక్కులొస్తాయని కొందరు ఏడాది కిందటే బ్యాంకులో డబ్బు తిరిగి జమ చేయగా, సుమారు వంద మంది కాంట్రాక్టర్లు ఆపరేటర్ మాట విని అలాగే మౌనంగా ఉండిపోయారు.

**ఐటీ విభాగంతో బయటపడ్డ రెండు బిల్లుల కథ**

ఇటీవల ఇన్?ఫర్?మేషన్ టెక్నాలజీ డిపార్ట్?మెంట్ అదనపు కమిషనర్ రాధికా గుప్తా మూడు కార్పొరేషన్ల హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పరిధిలో ఇప్పటి వరకు చెల్లించిన బిల్లులను సరిచూడటంతో రెండు బిల్లుల కథ కదిలింది. దీంతో కంగుతిన్న ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ దిద్దుబాటు చర్యలను ప్రారంభించింది. వడ్డీతో సహా రెండోసారి బ్యాంకులో పడిన డబ్బును తిరిగి చెల్లించాలని కాంట్రాక్టర్లకు సూచించగా, కొందరు అందుకు అంగీకరించారు. మరికొందరు తాము ఇచ్చిన కమీషన్ డబ్బును తిరిగివ్వాలని, కమీషన్ తీసుకున్న అధికారులను డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

## పెద్ది సుదర్శన్ రెడ్డి హెల్త్ బులిటెన్ విడుదల

# పరిస్థితి క్రిటికల్‌గా ఉందన్న యశోద వైద్యులు

మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంకా వెంటిలేటర్?పై చికిత్స పొందుతున్నారు. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్? నగరంలోని యశోద ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. పెద్ది ఆరోగ్య పరిస్థితిపై యశోద ఆసుపత్రి వైద్యులు అధికారిక హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం కారణంగా రక్తప్రసరణ వ్యవస్థ కుప్పకూలి షాక్‌కు గురైనట్లు వైద్యులు వెల్లడించారు. పరిస్థితి అత్యంత సున్నితంగా ఉండటంతో క్రిటికల్ కేర్, పల్మనరీ, కార్డియాక్, న్యూరాలజీ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యుల బృందం నిరంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం ఆయన పరిస్థితి క్రిటికల్‌గా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

మెదడు పనితీరులో జరిగిన మార్పులు, నష్టాన్ని సూచించే సంకేతాలు ఈఈజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ, టీసీడీ పరీక్షల్లో కనిపిస్తున్నాయని వైద్యులు తెలిపారు. సుదర్శన్ రెడ్డి న్యూరాలజికల్ పరిస్థితి, భవిష్యత్తు ఆరోగ్య స్థితిపై మరింత స్పష్టత కోసం 72 గంటల వ్యవధి తర్వాత మరోసారి ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్నారు. యన ఆరోగ్య పరిస్థితిని యశోద ఆసుపత్రి నిపుణులైన వైద్య బృందం నిరంతరం



పర్యవేక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తోంది.

**తొమ్మిదిసార్లు సీపీఆర్ తర్వాత**

ఆదివారం ఉదయం 8:00 గంటలకు హన్మకొండలోని అడ్వకేట్స్ కాలనీలో ఉన్న తన నివాసంలో ఛాతీ నొప్పి రావడంతో, ఆయనను వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు చికిత్స అందించిన డాక్టర్ మమతా రెడ్డి, సుదర్శన్ రెడ్డి 'కార్డియాక్ అరెస్ట్'కు గురయ్యారని తెలిపారు. వైద్య సిబ్బంది ఒక గంట వ్యవధిలో తొమ్మిది సార్లు సీపీఆర్ నిర్వహించిన తర్వాత ఆయన గుండె మళ్లీ పనిచేయడం ప్రారంభించిందని చెప్పారు. ఆయనకు ఆంజియోగ్రామ్ పరీక్ష కూడా నిర్వహించారన్నారు. అనంతరం, వెంటిలేటర్‌పై ఉంచి, మెరుగైన చికిత్స కోసం మధ్యాహ్నం 3:00 గంటల సమయంలో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు.

ఆయన వెంట బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ నాయకుడు హరీష్ రావు ఉన్నారు. పార్టీల అధినేత కేసీఆర్ నిన్న యశోదా ఆసుపత్రికి వచ్చి సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఇవాళ మంత్రి పొంగులేటి వచ్చి పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిన్న మంత్రి సీతక్క, పలువురు బీఆర్?ఎస్? నేతలు ఆసుపత్రికి వచ్చి పెద్ది ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకూడదు




**హైదరాబాద్:** సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీడ్ కంపెనీల ప్రతినిధులు, సీడ్ కంపెనీ అసోసియేషన్ సభ్యులు, వివిధ జిల్లాల్లో పత్తి విత్తనోత్పత్తిలో భాగస్వాములైన ఆర్గనైజర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విజ్ఞప్తి మేరకు సీడ్ రైతులకు ఆర్గనైజర్ల ద్వారా జరగాల్సిన చెల్లింపులు, అలాగే ఆర్గనైజర్లకు సీడ్ కంపెనీలు చెల్లించాల్సిన బకాయిల అంశంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలపై మంత్రి తుమ్మల సీడ్ కంపెనీల ప్రతినిధులను వివరణ కోరారు. దీనిపై స్పందించిన కంపెనీల ప్రతినిధులు గత సంవత్సరానికి సంబంధించిన బకాయిలన్నింటినీ ఈ ఏడాది ఆగస్టు నెలలోగా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అలాగే ఈ ఏడాది ప్రత్యేక పరిస్థితుల కారణంగా కంపెనీల వద్ద విత్తన నిల్వలు ఎక్కువగా ఉన్నాయని, ఆర్థిక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ ఆర్గనైజర్లకు, రైతులకు చెల్లింపులు చేయడానికి కట్టుబడి ఉన్నామని వివరించారు. అవసరమైతే బ్యాంకుల నుంచి మార్టేజ్ రుణాలు తీసుకొని అయినా చెల్లింపులు చేస్తామని, ఈ సంవత్సరానికి సంబంధించిన చెల్లింపులను ఆగస్టు నుంచి ప్రారంభించి డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేస్తామని అన్నారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీడ్ కంపెనీలు కేవలం లాభార్జన కోణంలో కాకుండా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్గనైజర్లకు, వారి ద్వారా రైతులకు చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీడ్ కంపెనీలు గానీ, ఆర్గనైజర్లు గానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకూడదన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులను వెంటనే ప్రారంభించి రైతులకు సకాలంలో అందేలా కార్యాచరణ చేపట్టాలని కంపెనీలను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సంబంధిత కంపెనీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా వెనుకాడబోదని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి, వ్యవసాయశాఖ డైరెక్టర్, సీడ్ కంపెనీ అసోసియేషన్ ప్రతినిధులు, పత్తి విత్తనోత్పత్తి కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

## బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని ఆయన విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, బిల్డర్లను, సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు వసూలు చేయడానికే హైడ్రాను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. అధికార పక్షానికి చెందిన వారి ఆస్తుల జోలికి వెళ్లడం లేదని, ఇదే నిజమైతే ముఖ్యమంత్రి సోదరుడి అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. భవిష్యత్తులో బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశంలో ఏ అధికారి అయినా 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా రేవంత్ రెడ్డికి వేటకుక్కలా మారిందని, దీనిని అడ్డుపెట్టుకుని బిల్డర్ల వద్ద 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సోదరుడి నివాసంతో పాటు కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, మహేందర్ రెడ్డి, కేవీపీల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో కలిపేస్తామని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కూడా కేటీఆర్ స్పందించారు. ఈ ఉదంతంతో దేశ యువత మొదటిసారిగా మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన అసమర్థతతో సరైన మద్దతు ఇవ్వలేకపోవడంతో, విద్యార్థులే నేరుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం వచ్చినప్పుడు యువత తప్పకుండా స్పందిస్తుందని కేసీఆర్ గతంలోనే చెప్పారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్ పేపర్ మూడుసార్లు లీక్ అయిందంటూ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

## ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లిస్తాం




-మొదటిపేజీ తరువాయి

విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందని, గ్లోబరీనా వంటి సంస్థలు నాడు తెలంగాణలో అక్రమాలకు పాల్పడ్డాయని, నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల సీబీఎస్ఈకి విస్తరించారని, గ్లోబరీనా వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య ఉండదు**

కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో చట్టాలు రూపొందిస్తామని, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కొట్టేయాలని చూసిన సంస్థలపై విచారణ జరుగుతోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బకాయి పెట్టిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూ.8 వేల కోట్లు భారంగా మారిందని అన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ తాము ఇవ్వట్లేదనే భ్రమలు కల్పించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్య పదేపదే ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఏపీలో రూ.10 వేల కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆర్.కృష్ణయ్య ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ రాష్ట్రంలో బకాయిలపై మాట్లాడరని సీఎం తెలిపారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఉందని, అక్కడ బకాయిలపై మాట్లాడాలని, ఏపీలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించాక తెలంగాణ గురించి మాట్లాడితే బాగుంటుందని సూచించారు. ఏ ఏడాదికి సంబంధించిన బకాయిలు అదే ఏడాది చెల్లిస్తామని, ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రణాళికలు రచించామని, భవిష్యత్తులో ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య తెలంగాణలో ఉండదని స్పష్టం చేశారు.

విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం. యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోంది. విద్య వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయి. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టాం.రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోంది రేవంత్ రెడ్డి, సీఎం

నవగీతం
తెలుగు దినపత్రిక
బుధవారం
29 జూలై 2026

సంపాదకీయం

# విద్యామంత్రులకు ఏమౌతోంది

విద్యార్థుల నిరసనల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. దీంతో ఆయన మోదీ ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖలో గడువు ముగియక ముందే బాధ్యతల నుంచి తప్పుకున్న మంత్రుల జాబితాలో చేరిపోయారుభారత విద్యా వ్యవస్థపై జంతర్ మంతర్ వద్ద మొదలైన ప్రశ్నలు, వారం రోజుల్లోనే దేశవ్యాప్త యువజన ఆందోళనగా మారాయి. కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్లను ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమ ముగింపును ప్రకటించారు.అయితే, ఈ ఉద్యమం భారత విద్యా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ తీరు, ప్రభుత్వ ప్రాధాన్యతలపై ఒక కొత్త చర్చకు తెరలేపింది. ఇప్పుడు ప్రశ్నలు కేవలం ప్రస్తుత విద్యాశాఖ మంత్రిపైనే కాకుండా, మోదీ ప్రభుత్వ హయాంలో విద్యా మంత్రిత్వ శాఖ నడిచిన మొత్తం దిశపైనే వ్యక్తమవుతున్నాయి.2014 నుంచి ఇప్పటివరకు స్మృతి ఇరానీ, ప్రకాశ్ జావదేకర్, రమేశ్ పోఖ్రియాల్ 'నిశంక్', ధర్మేంద్ర ప్రధాన్ నాయకత్వంలో విద్యా మంత్రిత్వ శాఖ సరికొత్త విద్యా విధానాన్ని, సంస్థాగత మార్పులను, భావజాలపరమైన ఎన్నో చర్చలను చూసింది.ఈ సంవత్సరాలలో విద్యా వ్యవస్థను మెరుగుపరచడం కంటే భావజాల మార్పులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని విమర్శకులు ఆరోపిస్తుండగా, ప్రభుత్వం మాత్రం దీనిని ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న నిర్మాణాత్మక సంస్కరణల ప్రక్రియగా పేర్కొంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో, మోదీ హయాంలోని నలుగురు విద్యాశాఖ మంత్రుల పాత్రను ఏ కోణంలో చూడాలనే ప్రశ్నను ప్రస్తుత వివాదం మరోసారి తెరపైకి తెచ్చింది.12 ఏళ్ల మోదీ ప్రభుత్వంలో విద్యా మంత్రిత్వ శాఖ మాత్రమే నలుగురు వేర్వేరు మంత్రుల మారిన ఏకైక కీలక శాఖగా నిలిచింది. అదే సమయంలో హోం, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక, రక్షణ, ఆరోగ్య వంటి మంత్రిత్వ శాఖలలో మాత్రం దాదాపు స్థిరత్వం కొనసాగింది.ముఖ్యమైన విషయమేమిటంటే, ఈ ముగ్గురు మాజీ విద్యాశాఖ మంత్రులు పదవుల నుంచి తప్పుకున్న కొద్ది సంవత్సరాలకే వివిధ కారణాల వల్ల కేంద్ర క్యాబినెట్ నుంచి కూడా పూర్తిగా కనుమరుగయ్యారు.సమాచార-ప్రసార శాఖలో గత 12 ఏళ్ల వ్యవధిలో ఏడుగురు కేంద్ర మంత్రులు, సంస్కృతి మంత్రిత్వ శాఖలో ఐదుగురు కేంద్ర మంత్రులు మారారు.మోదీ ప్రభుత్వ మొదటి విడత పదవీకాలంలో స్మృతి ఇరానీ, ప్రకాశ్ జావదేకర్ మానవ వనరుల వికాస మంత్రిత్వ శాఖ బాధ్యతలను నిర్వహించారు. మోదీ 2.0 హయాంలో ఈ బాధ్యత రమేశ్ పోఖ్రియాల్ నిశంక్‌కు దక్కింది.అయితే, 2021లో జరిగిన క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమించారు. ఆయన రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులు నెల రోజుల పాటు జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు కూర్చున్నారు, చివరికి కేంద్ర ప్రభుత్వం ఆ ఒత్తిడికి తలొగ్గింది. పార్లమెంటులో నీట్ లీక్ వ్యవహారంపై చర్చ జరపడానికి మోదీ ప్రభుత్వం అంగీకరించింది, కానీ, రాజీనామా డిమాండ్‌ను చర్చకు షరతుగా పెట్టవద్దని ప్రతిపక్షాలకు కోరుతూ వచ్చింది. నీట్ పరీక్ష లీక్ కేసును పక్కన పెడితే, సంఘ్‌కు సంబంధించిన అన్ని ప్రధాన లక్ష్యాలను ధర్మేంద్ర ప్రధాన్ ఎలాంటి హడావుడి లేకుండా అమలు చేయడంలో విజయం సాధించారు..2014లో ఏర్పాటైన మొదటి మోదీ క్యాబినెట్‌లో ధర్మేంద్ర ప్రధాన్‌ను పెట్రోలియం శాఖ మంత్రిగా నియమించారు. ఆ తర్వాత మోదీ 2.0లో ఆయన విద్యాశాఖ మంత్రి అయ్యారు, మోదీ 3.0 పదవీకాలంలోనూ ఆ బాధ్యతల్లోనే కొనసాగారు.ఆయన పదవీకాలంలో జాతీయ విద్యా విధానానికి ఊతం లభించింది. మాతృభాష, పలు భాషల్లో విద్యను ఆయన ప్రోత్సహించారు. కానీ, త్రిభాషా సూత్రంపై తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంతో సుదీర్ఘకాలం పాటు వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచారు.. రాజకీయ జోక్యం, 'హిందీ రుద్దడం' లాంటి ఆరోపణలను ప్రత్యర్థులు ఆయనపై గుప్పించారు, దీనివల్ల విద్యా విధానం కేంద్రం వర్సెస్ రాష్ట్రాల వివాదంగా మారింది.మోదీ పాలనలో విద్యాశాఖలో అవలంబించిన విధానాలన్నీ వామపక్ష భావజాలాన్ని తొలగించే లక్ష్యంతోనే అమలయ్యాయని శరద్ గుప్తా పేర్కొన్నారు.భారత విద్యా వ్యవస్థ నుంచి వామపక్ష విద్యా విధానాన్ని తొలగించడమే సంఘ్ ప్రధాన లక్ష్యం..2014లో స్మృతి ఇరానీని మానవ వనరుల అభివృద్ధి(హెచ్ఆర్డీ) మంత్రిగా నియమించినప్పుడు, ఆమె రాహుల్ గాంధీ చేతిలో ఓడిపోయిన తర్వాత క్యాబినెట్‌లో భాగమయ్యారు.మోదీ రెండవ విడత పదవీకాలంలో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేరును మార్చారు. జాతీయ విద్యా విధానంలోని ప్రధాన సిఫార్సులలో భాగంగా 'విద్యపై మరింత దృష్టి పెట్టడానికి' కేంద్ర ప్రభుత్వం ఈ మార్పు చేసింది.1985 కంటే ముందు ఈ శాఖను 'విద్యా మంత్రిత్వ శాఖ' అనే పిలిచేవారు. అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ పాలనలో దీని పేరును మార్చారు. అప్పట్లో 'విద్యను మరింత విస్తృత కోణంలో చూడటం' దీని వెనుక ఉన్న ఉద్దేశంగా చెప్పారు.2014 లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్ ప్రకారం, స్మృతి ఇరానీ చదువు 12వ తరగతి వరకే సాగింది. దీనిని కాంగ్రెస్ ఒక పెద్ద అంశంగా మార్చింది. అయితే, ఆమె పార్లమెంటులో హిందీ, ఇంగ్లీష్ భాషల్లో తన వాదనను చాలా స్పష్టంగా, బలంగా వినిపిస్తారని చెబుతూ బీజేపీ ఈ విమర్శలను తోసిపుచ్చింది.నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాతే నూతన విద్యా విధానంపై కసరత్తు మొదలైంది.మంత్రిత్వ శాఖలో స్మృతి ఇరానీ పదవీకాలంలో నూతన విద్యా విధానానికి సంబంధించిన పనులు ప్రారంభం కాగా, మోదీ హయాంలోని మూడవ విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ 'నిశంక్' సమయంలో దీనిని అమలు చేశారు.భారతదేశంలో నూతన విద్యా విధానం 34 సంవత్సరాల తర్వాత 2020లో అమల్లోకి వచ్చింది. దీనిని మోదీ పదవీకాలంలో ఒక పెద్ద అడుగుగా భావిస్తారు. నూతన విద్యా విధానంలో విద్యా బడ్జెట్‌ను జీడీపీలో ఆరు శాతంగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.నలుగురు విద్యాశాఖ మంత్రుల హయాంలో దాదాపు ప్రతి విశ్వవిద్యాలయంలోనూ అధ్యాపకుల ఎంపికలో భావజాలానికే పెద్దపీట వేశారు. ఈ విధంగా భవిష్యత్తులో ప్రభుత్వం మారినప్పటికీ, కనీసం రెండు తరాల పాటు విద్యా సంస్థలపై సంఘ్ తన ప్రభావాన్ని నిలుపుకోగలుగుతుంది" అన్నారు.వామపక్షాల పట్టుగా భావించే జేఎన్‌యూలో 2022లో శాంతిశ్రీ ధూళిపూడి పండిట్‌ను వైస్ ఛాన్సలర్‌గా నియమించారు. ఈ విశ్వవిద్యాలయ చరిత్రలోనే తొలి మహిళా వైస్ ఛాన్సలర్‌గా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో తనకున్న అనుబంధాన్ని బహిరంగంగా అంగీకరించిన వ్యక్తిగా ఆమె గుర్తింపు పొందారు. అశాస్త్రీయ ప్రకటనల వల్ల రమేశ్ పోఖ్రియాల్ వివాదాల్లో చిక్కుకున్నారు. 'చరక మహర్షి అణు-పరమాణువులను కనుగొన్నారు' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు.కోవిడ్ సమయంలో జేఈఈ-నీట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించిన తర్వాత ఆయనపై ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. దీనికి వ్యతిరేకంగా పౌరులు కోర్టుకు కూడా వెళ్లారు, అక్కడ తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చింది. అయితే, అప్పట్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు, ఇది వివాదాస్పదమైంది.కోవిడ్ బారిన పడిన తర్వాత, అనారోగ్య కారణాల వల్ల రమేశ్ పోఖ్రియాల్ తన పదవికి రాజీనామా చేశారని అంటారు. కానీ, ఆ తర్వాత ఆయన మోదీ క్యాబినెట్ నుంచి పూర్తిగా తప్పుకున్నారు. ఆ స్థానంలో ధర్మేంద్ర ప్రధాన్ 2021 నుంచి జూలై 2026 వరకు ఈ బాధ్యతలను నిర్వహించారు.

# ఆకాశమే హద్దుగా..!

హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ అభివృద్ధి చేసిన విక్రం-1 రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలోకి చేరుకోవడం భారత అంతరిక్ష చరిత్రలో ఒక కీలక మలుపు. దేశంలో ప్రభుత్వ గుత్తాధిపత్యంలో కొనసాగుతున్న అంతరిక్ష పరిశోధనలో ప్రైవేట్ రంగానికి ద్వారాలు తెరిచిన ఘట్టం ఇది. 'మిషన్ ఆగమన్' పేరుతో శ్రీహరికోట నుంచి ప్రయాణించిన విక్రం-1 పూర్తిగా ప్రైవేట్ సంస్థ రూపొందించి కక్ష్యలోకి ప్రవేశపెట్టిన భారత తొలి రాకెట్‌గా చరిత్రకెక్కింది. ఈ ప్రయోగం ద్వారా భారత్ ప్రపంచంలోని ప్రైవేట్ అంతరిక్ష రంగంలో అమెరికా, చైనా వంటి దేశాలతో పోటీపడే స్థాయికి చేరుతున్నట్లు స్పష్టమైంది. దశాబ్దాలుగా అంతరిక్ష పరిశోధనలను పూర్తిగా ప్రభుత్వ సంస్థ ఇస్రో ఆధిపత్యంలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల వచ్చిన విధానపరమైన మార్పులతో ప్రైవేట్ రంగం ప్రవేశానికి వీలు కలిగింది. విక్రం-1తో దీనికి శుభారంభం జరిగింది.ఈ ప్రయోగం ద్వారా గ్లోబల్ స్పేస్ ఎకానమీలో మనదేశం కీలక పాత్ర పోషించే రోజులు ఎంతో దూరంలో లేవు.

స్కైరూట్ విజయం ప్రత్యేకించి హైదరాబాద్ నగరానికి గర్వకారణం అని చెప్పాలి. ఇప్పటివరకు ఐటీ రంగంలో తన సత్తా చాటుకున్న భాగ్యనగరం, ఇప్పుడు స్పేస్ టెక్నాలజీలోనూ విజయబావుటా ఎగరేసింది. తెలంగాణ తొలి సీఎంగా కేసీఆర్ హయాంలో, అప్పటి మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన స్టార్టప్ హబ్‌లో స్కైరూట్ సంస్థ పురుడుపోసుకున్నది. దీని స్ఫూర్తితో మరెన్నో సంస్థలు రావడంతో తెలంగాణ 'స్పేస్ హబ్'గా ఎదగడం సరికొత్త రాష్ట్రానికి గర్వకారణం. అబ్బురపరిచే ప్రతిభను ప్రదర్శించిన స్కైరూట్ యువ ఇంజినీర్లపై ప్రశంసలు కురుస్తున్నాయి. ఈ విజయాన్ని రాష్ట్రంలోని యువత స్ఫూర్తిగా మలచుకోవాలి. అయితే ఇది ఆరంభం మాత్రమే. ప్రైవేట్ రంగం అంతరిక్ష పరిశోధనలో వేళ్లూనుకోవాలంటే ముందు ఎన్నో సవాళ్లు ఉంటాయి. వాటిని అధిగమించాలంటే స్థిరమైన పెట్టుబడులు, నైపుణ్య అభివృద్ధి, ప్రభుత్వ సహకారం ఈ మూడూ కీలక పాత్ర పోషిస్తాయి. దీక్షాదక్షతలతో కృషి చేస్తే విజయం వరించి తీరుతుందని స్కైరూట్ వ్యవస్థాపకుల కథ చెప్తున్నది.

అయితే నాణేనికి మరోవైపున అన్నట్టు ఈ ప్రైవేట్ విజయగాథను వెన్నంటే ప్రభుత్వరంగ సంస్థ సంక్షోభంలోకి కూరుకుపోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవలి కాలంలో




ఇస్రోలో చోటుచేసుకుంటున్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణలు (వీఆర్ఎస్) తీవ్రమైన సమస్యగా మారుతున్నది. ఇటీవలకాలంలో 100 నుంచి 120 మంది శాస్త్రవేత్తలు రాజీనామా చేయడం లేదా స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకోవడం దేశానికి శుభసూచకం కాదు. స్వల్ప వ్యవధిలో అంతమందిని కోల్పోవడం ఏ సంస్థకూ మంచిది కాదు. ప్రైవేట్ స్పేస్ కంపెనీల ఆకర్షణీయమైన వేతనాలు, సౌకర్యాలు ఓ వైపు ఆకర్షిస్తుంటే, ఇస్రోలోని కఠినమైన నియమ నిబంధనలు, పరిమిత అవకాశాలు మరోవైపు నుంచి అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలను బయటకు నెడుతున్నాయని అంటున్నారు. ఇది కేవలం ఉద్యోగులను కోల్పోవడం కాదు, అనుభవం, జ్ఞానం, సృజనాత్మకత వంటి అమూల్యమైన మానవ వనరుల సంపదను కోల్పోవడంగా చూడాల్సి ఉంటుంది. గగనయాన్ వంటి కీలక ప్రాజెక్టుల నేపథ్యంలో ఈ పరిణామం మరింత ఆందోళన కలిగిస్తున్నది. తక్షణమే ప్రోత్సాహకాలు, సంస్కరణలు, అనుకూలమైన పని వాతావరణం కల్పించకపోతే, ఇస్రో దీర్ఘకాలంలో తన ఆధిపత్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉన్నది.

దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య సమన్వయం, సమతూకం సాధించాల్సిన అవసరం కనిపిస్తున్నది. ప్రైవేట్ రంగం ఎదగడాన్ని ఎవరూ కాదనరు. అయిదే అది ప్రభుత్వ రంగానికి సమస్యలు తేకూడదు. ప్రైవేట్ రాకెట్లు పైకి లేవాలన్నా ఇస్రో వేదికలే శరణ్యమన్న సంగతి గుర్తుంచుకోవాలి. దేశంలో అంతరిక్ష విజ్ఞానానికి పునాదులు వేసి మహోన్నత శిఖరాలను అందుకున్న ఇస్రోను సమస్యలపాలు కానివ్వడం మంచిది కాదు. ప్రైవేట్‌కు ద్వారాలు తెరువడంతోనే సరిపోదు. అంతరిక్ష విజ్ఞానం అభివృద్ధిలో రెండు రంగాలూ చెట్టపట్టాలు వేసుకునే సాగేలా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉన్నది

# నిరసనలకు 'సుప్రీం' ఛత్రం!

ఉద్యమించటం, నిరసనలు వ్యక్తం చేయటం నేరమన్న అభిప్రాయం వ్యవస్థల్లో నరనరానా వ్యాపించింది. ఒక బ్యానర్‌తోనో, ఒక జెండాతోనో, నిర్దిష్టమైన ఎజెండాతోనో జనం రోడ్లపైకి రాగానే లాఠీలు పైకి లేవడం, బాష్పవాయు గోళాలు వర్షించడం... ఉద్యమకారుల్ని ఈడ్చుకెళ్లడం, పిడిగుద్దులు, బూటుకాళ్లతో తన్నడాలు రివాజయ్యాయి. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఉద్యమంలోనైతే పెల్లెట్లనుంచి ఏకే--47 బుల్లెట్ల వరకూ కనబడటం అందరినీ దిగ్భ్రాంతిపరిచింది. ఈ నేపథ్యంలో సోమవారం సుప్రీంకోర్టు ధర్మాసనం శాంతియుత నిరసనలపట్ల ఎలా వ్యవహరించాలో తెలియజేస్తూ మార్గదర్శ కాలు జారీచేస్తామనటం స్వాగతించదగింది. నిరసనలు రాజ్యాంగం ప్రసాదించిన హక్కనీ, వాటిని నిరాకరించటం సరికాదనీ వ్యాఖ్యానించింది. పాలకులూ, వారిని సమర్థించే కొన్ని వర్గాలూ ఈ సంగతి మరిచి చాన్నాళ్లయింది. ఉద్యమాలూ, నిరసనలను ఏవగించుకునే జాతీయ మీడియా చానెళ్లకు కూడా కొదవలేదు.

దగ్గర వాటర్ బాటిళ్లు తప్ప మరేం లేని 15, 16 ఏళ్ల పిల్లల్ని... అందునా ఆడపిల్లల్ని గూండాలుగా అభివర్ణించే స్థాయికి అవి దిగజారాయి. ఆడపిల్లల ఛాతీపై చేతులువేసి నెట్టడం, చెంపదెబ్బలు కొట్టడం, లాఠీలతో మోదటం ఏ రకంగా సమర్థనీయం? వారు కనీసం ప్రతిఘటించే ప్రయత్నం కూడా చేయలేదే! విధి నిర్వహణలోవున్న పాత్రికేయుల్నీ, పక్కన నిలబడి చూస్తున్నవారినీ కూడా తలలు పగలగొట్టారు. పెల్లెట్లతో గాయపరిచారు. ఇలా అతిగా ప్రవర్తించిన సిబ్బంది మాస్కులు, స్వెట్టర్లు ధరించి వివరాలు తెలియకుండా జాగ్రత్త పడ్డారు. డీకే బసు వర్సెస్ పశ్చిమ బెంగాల్ కేసులో వెలువరించిన తీర్పులో చట్టబద్ధమైన విధి నిర్వహణలో ఉండే ప్రతి పోలీసు అధికారి తప్పనిసరిగా తమ గుర్తింపు తెలిసేలా ఉండాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. అటుపై అది సీఆర్‌పీసీలో 41--బి సెక్షన్‌గా, ఇప్పుడు బీఎన్ఎస్‌లో సెక్షన్--36గా చేరింది. బలప్రయోగం చేయటానికి రాజ్యానికున్న అధికారం తాలూకు బాధ్యతను నిర్దిష్టంగా గుర్తించదగిన వ్యక్తికి ఆపాదించగలిగేలా ఉండాలన్న రాజ్యాంగపరమైన హామీ ఇది.

పెద్దయెత్తున జనం పాల్గొనే ఆందోళనల్లో నేరగాళ్లు చొరబడే



అవకాశాలు లేకపోలేదు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడే అవకాశాలు తోసిపుచ్చలేం. అలాంటివారిని గుర్తించి అదుపు చేయటానికే సాధారణ దుస్తుల్లో పోలీసు సిబ్బంది ఉంటారు. అంతకన్నా ముందు నిరసన జరిగే ప్రాంతాన్ని నిరంతరం నిఘా కళ్లు చూస్తుంటాయి. అలాంటపుడు ఊరేగింపు జరపాలని సీజేపీ నిర్ణయించిన రోజు వేకువజామున జంతర్‌మంతర్‌లో పెద్ద పెద్ద రాళ్లతో కూడిన ట్రక్కు, అప్పటికే పూర్తిగా ధ్వంసమైన వాహనం ఎలా చేరాయి? అప్రమత్తంగా ఉన్న కార్యకర్తలు వెనువెంటనే వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. అప్పుడైనా చర్యలుంటే పోలీసులపై జరిగాయంటున్న దాడులకు ఆస్కారం ఉండేది కాదు. కానీ అటుతర్వాత విచక్షణారహితంగా ఉద్యమకారుల్ని కొట్టారు. తలలకు గాయాలై నెత్తురోడుతున్నవారు అనేకమంది వీడియోల్లో కనబడ్డారు. కొందరికి చేతులు విరిగాయి. లాఠీచార్జి చేసేటపుడు మోకాలు దాటి పై భాగంలో కొట్టడం చట్టవిరుద్ధం.

ఈ నెల 25న బిహార్ బంద్ సందర్భంగా శివాన్ జిల్లాలో ఉద్యమకారులతో ఘర్షణ చోటుచేసుకున్నప్పుడు ఒక కానిస్టేబుల్ ఏకే--47తో కాల్పులు జరుపుతూ కెమెరాలకు చిక్కాడు. 15 యేళ్ల బాలుడితోసహా ముగ్గురు గాయపడ్డారని అంటున్నా పోలీసులు మాత్రం ఆ కాల్పులవల్ల ఎవరూ గాయపడలేదంటున్నారు. నిరాయుధ పౌరులపై మిలిటరీ గ్రేడ్ ఆయుధాలు ఉపయోగించరాదన్న ప్రాథమిక పరిజ్ఞానం కూడా అతగాడికి లేదని అర్థమవుతుంది. అతన్ని సస్పెండ్ చేశారు సరేగానీ... కనీస అవగాహన లేనివారికి ఇటువంటి ప్రమాదకర ఆయుధాలు ఎలా ఇచ్చారన్నది తేల్చాలి. మొన్న శుక్రవారం విజయవాడలో విద్యార్థి, యువజన సంఘాల 'చలో లోక్‌భవన్'లో సైతం ఇలాంటి దృశ్యాలే దర్శనమిచ్చాయి. ఏపీలో అమలయ్యేది రెడ్ బుక్ రాజ్యాంగం కనుక విద్యార్థి సంఘాల కండువాలేసుకుని మరీ పోలీసులు దాడిచేశారు. యువకుల్ని బూటుకాళ్లతో తన్ని, పిడిగుద్దులు గుద్ది తీవ్రంగా గాయపరిచారు. రోడ్డుపై పడేసి కొట్టారు. ఇలా ఆటవిక ప్రవృత్తి మితిమీరుతున్న దశలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవటం శుభ పరిణామం.

# అమెరికా అమిత్ర వైఖరి

ఒకసారంటూ పొరపొచ్చాలు వచ్చాక ఎంత సన్నిహిత మిత్రుల మధ్యనైనా తిరిగి సాధారణ సంబంధాలు ఏర్పడటం అంత సులభం కాదు. ఫ్రాన్స్‌లో జరిగిన జీ--7 దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య బుధవారం జరిగిన ద్వైపాక్షిక సమావేశం తీరుతెన్నులు గమనిస్తే ఈ సంగతి సులభంగా అర్థమవుతుంది. ట్రంప్ గత 16 నెలలుగా అనుసరిస్తున్న అమిత్ర వైఖరి ఇందుకు కారణం. మిత్ర దేశాలని లేదు, ప్రత్యర్థి దేశాలని లేదు -- అందరినీ ఒకే గాటన కడుతూ, ఒక దేశాధినేతకు ఉండాల్సిన కనీస ఔచిత్యాన్ని మరిచి ఇష్టానుసారం మాట్లా డటం ఆయనకు అలవాటుగా మారింది. అంతేకాదు -- ఎడాపెడా అధిక సుంకాలు విధించటం, తమ సరుకుపై సుంకాలు తగ్గించాలని కోరడం వంటివి మన దేశాన్ని చీకాకు పరి చాయి. ఇలాంట చేదు అనుభవాలు ఎన్ని ఎదురైనా మన దేశం సంయమనం పాటించింది. నిజానికి మొన్న భారత నావికులు ముగ్గుర్ని హోర్ముజ్ జలసంధి వద్ద హత్య చేసిన ఉదంతంతోసహా ఈ 16 నెలల పొడవునా మన దేశం పరుషంగా మాట్లాడింది ఎప్పుడూ లేదు. నోబెల్ శాంతి బహుమతి యావలో భారత్--పాక్ యుద్ధాన్ని తానే ఆపాననీ, ఇద్ద రినీ తీవ్రంగా బెదిరించాననీ మాట్లాడినప్పుడు అందులో ఏమాత్రం నిజం లేదని మన దేశం చెప్పింది. ఆయన ఇలా డప్పుకొట్టుకుంటున్నప్పుడల్లా మొదట్లో ఖండిస్తూనేవచ్చింది. కానీ దీన్ని ఆయన ఒక అలవాటుగా మార్చుకున్నారని తేలాక మిన్నకుండి పోయింది. అయినా ట్రంప్‌లో ఆగ్రహావేశాలు తగ్గలేదని తాజా సమావేశం రుజువు చేసింది. మాటలకేం... ట్రంప్ చాలా మాట్లాడారు. 55 నిమిషాలపాటు సాగిన ఈ సమావేశం అనంతరం 'మోదీ మంచిగా కనబడతారు. బాగుంటారు. దేవదూత. కానీ 'కిల్లర్'. వాణిజ్య, వ్యాపార చర్చల్లో చాలా కఠినంగా, నిక్కచ్చిగా ఉంటారు' అంటూ ప్రశంసలతో ముంచెత్తారు. మోదీ ప్రధానిగా ఉన్నంతకాలం ఎవరైనా భారత్‌వైపు కన్నెత్తి చూస్తే వాళ్ల అంతు చూస్తామని కూడా చెప్పారు. వాణిజ్య ఒప్పందం విషయంలో చాలా దగ్గరగా వచ్చేశామని కూడా అన్నారు. కానీ చేతలు చూస్తే అందుకు అనుగుణంగా లేవు. తన ఆధ్వర్యంలోని కమాండ్లలో ఒకటైన ఇండో--పసిఫిక్ కమాండ్‌కు ఆ పేరు పెట్టింది

నవగీతం తెలుగు దినపత్రిక
బుధవారం
29 జూలై 2026

# సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**పైడిమడుగులో ఫార్మ్‌పాండ్, రీచార్జ్ బోర్‌వెల్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులకు భూమిపూజ**

**జోగిన్‌పెల్లిలో వీవో భవనం, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను తనిఖీ చేసిన కలెక్టర్**










**నవగీతం,(జగిత్యాల ప్రతినిధి):** సూపర్ ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగం చేసుకొని భూగర్భ జలాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.

మంగళవారం కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్న ఫార్మ్‌పాండ్‌కు భూమిపూజ నిర్వహించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ , అనంతరం రీచార్జ్ బోర్‌వెల్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. గ్రామంలో చేపడుతున్న కమ్యూనిటీ సోక్‌పిట్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ప్రతి వర్షపు నీటి బొట్టును భూగర్భంలోకి ఇంకించి నీటి నిల్వలను పెంచడం అత్యంత అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీ.బీ.జీ.ఆర్.ఏ.ఎం. (ఎదీ+=ూవీ) నిధులతో గ్రామాల్లో ఫార్మ్‌పాండ్లు, సోక్‌పిట్లు, ఉట్టకుంటలు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి రైతు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ పొలాల్లో ఫార్మ్‌పాండ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఫార్మ్‌పాండ్ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం వల్ల పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందుబాటులో ఉండటంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరిగి కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం కోరుట్ల మండలం జోగిన్‌పెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న వీవో భవనం మరియు అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.వీవో భవనం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండరాదని, నిర్మాణాలన్నీ నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.ఈ పర్యటనలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపిడివో రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్ లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు మరియు తదితరులు పాల్గొన్నారు

## వైసీపీ సీనియర్లలో అసంతృప్తులు

**నెల్లూరు :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎటు వెళ్తుందో తెలియడం లేదు. ఆ పార్టీ సీనియర్లలో ఆందోళన అదే. ప్రజా పోరాటాలు చేయడం లేదు. ప్రజా ఆందోళనలు నిర్వహించడం లేదు.. జాతీయస్థాయిలో జరుగుతున్న పెద్ద ఉద్యమాలకు మద్దతు తెలపడం లేదు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చుట్టూ వివాదాలు, కేసులు నడుస్తున్నాయి. అలాగని గత ప్రభుత్వ హయాంలో జరిగిన కేసులు కావు. ఇందులో నేరుగా కూటమి ప్రభుత్వం కలుగజేసుకోవడం లేదు. కానీ ఒక్క వైసీపీ నేతపై కేసు నమోదు అవుతుంది. అరెస్టుల పర్వం నడుస్తోంది. దీనిపైనే వైసీపీలో సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. వ్యక్తిగత వ్యవహార శైలితో పార్టీని కొంతమంది నేతలు డ్యామేజ్ చేస్తున్నారన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. ఇది పార్టీ పై ప్రతికూలత చూపుతోందన్న ఆవేదన సీనియర్లలో ఉంది. ఇన్ని రోజులు అధినేత జగన్మోహన్ రెడ్డి ఏం చేసినా ఊరుకున్నామని.. ఇకనుంచి ఊరుకోబోమని వారు చెబుతున్నారు. హెచ్చరించినంత పని చేస్తున్నారు.కొద్ది రోజుల కిందట సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పార్టీలోనే పవర్ఫుల్ నేత ఆయన. మరి ఎందుకు ఆ స్థాయిలో మాట్లాడడం లేదు అని రిపోర్టర్ ప్రశ్నించేసరికి పెద్దిరెడ్డి వింత సమాధానం చెప్పారు. తమ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆవేదనతో సంకేతాలు ఇచ్చారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని.. తాను అటువంటిదే కోరుకుంటానని.. తమ పార్టీ నేత అంబటి రాంబాబు లా మాట్లాడను అంటూ చురకలు అంటించారు. అయితే అది అంబటి రాంబాబు నువ్వు ఉద్దేశించింది కాదు. తెర వెనుక జగన్ వైఖరిని తప్పు పట్టడమే దాని ముఖ్య ఉద్దేశం. ఒక్క పెద్దిరెడ్డి మాత్రమే కాదు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు లాంటి సీనియర్ నేతలు వైసీపీలో అనవసర వ్యాఖ్యలు చేసే నాయకుల వైఖరిని తప్పుపడుతున్నట్లు తెలుస్తోంది.మొన్నటి వరకు కూటమి ప్రభుత్వం పాత కేసులను తెరపైకి తెచ్చి వెంటాడింది అని వైసిపి ఆరోపించింది. కానీ ఇప్పుడు ఒక్కో నేత అరెస్టు తీరు చూస్తే మాత్రం భిన్నంగా ఉంది. కేసులు నమోదు కావడం వెనుక చూస్తుంటే వ్యక్తిగత వ్యవహార శైలి కనిపిస్తోంది. మాజీ మంత్రి అప్పలరాజు వ్యవహరించిన తీరుతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. తన కుమారుడు బైక్ రైటింగ్ కారణంగా ఓ మనిషి ప్రమాదానికి గురయ్యారు. కానీ అది తన కొడుకు మెడకు చుట్టుకోకుండా మరో వ్యక్తిని బలిపశువు చేయడానికి చూశారు. దానిని కూడా సక్రమంగా హ్యాండిల్ చేయలేకపోయారు. చివరకు ఆయన అరెస్టు కూడా జరిగిపోయింది. పార్టీకి డ్యామేజ్ మిగిల్చింది. తమ్మినేని సీతారాం గురించి అయితే చెప్పనవసరం లేదు. స్పీకర్ గా ఉంటూనే ఒక భూమి యజమాని బతికుండగానే ఆయన వారసుల పేరుతో నకిలీ ధ్రుపత్రాలు సృష్టించి.. తన కుమారుడి పేరుతో నాలుగు కోట్ల విలువైన భూమిని రాయించుకున్నారు.. సామాన్యులు సైతం దీనిని తప్పుపడుతున్నారు.తాజాగా మాజీ మంత్రి జోగి రమేష్ ఫ్యామిలీ కేసుల బారిన పడింది. జోగి రమేష్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులు 11 మందిపై కోడలు మేఘన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు కట్నం, గృహహింస, హత్యాయత్నం వంటి ఆరోపణలు చేస్తూ ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీంతో జోగి రమేష్ ఫ్యామిలీ కేసుల బారిన పడింది. వీటిని రాజకీయ కక్ష్యలో చూపించే ప్రయత్నం జరుగుతోంది. కానీ ఇది వ్యక్తిగత కేసులు అన్నది ప్రజలకు తెలుసు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజా పోరాటాలు చెయ్యకపోగా ఇలా వ్యక్తిగత వైఖరితో పార్టీని డ్యామేజ్ చేస్తున్నారు అనేది సీనియర్ల అభిప్రాయం. అంతకుమించి జగన్ వారిని వెనుకేసుకు రావడం పై కూడా పార్టీలో భిన్న స్వరం వినిపిస్తోంది. ఇక తేల్చుకోవాల్సింది జగన్మోహన్ రెడ్డి మాత్రమే.

## ఫ్లై ఓవర్ల కింద విద్యుద్ సబ్ స్టేషన్లు

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఫ్లై ఓవర్స్ కింద ఉన్న ఖాళీ స్థలాలలో సబ్ స్టేషన్ నిర్మాణాలను చేపట్టనున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ ఽ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఎస్పీడీసీఎల్ ఇంజనీర్లు ఈ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. హైదరాబాద్ వీఎస్టీ స్టీల్ బ్రిడ్జ్ కింద ఏర్పాటు చేయనున్న సబ్ స్టేషన్ స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఛైర్మెన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫ్లై ఓవర్స్ స్ట్రక్చర్ కు ఎలాంటి హాని కలుగకుండా సబ్ స్టేషన్ నిర్మాణం చేపడుతామన్నారు. వీటి నిర్మాణాల వల్ల ఉన్న సబ్ స్టేషన్ లపై లోడ్ తగ్గడంతో పాటు , కొత్త కనెక్షన్ లకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. నగరంలో ఐదు చోట్ల ఫ్లై ఓవర్ కింద స్థలాలను గుర్తించామని , త్వరలో అక్కడ సబ్ స్టేషన్ నిర్మాణం చేపడతామని ఆయన వివరించారు.

## కుత్బుల్లాపూర్ లో చైన్ స్నాచింగ్

**మేడ్చల్** కుత్బుల్లాపూర్ లో చైన్ స్నాచింగ్ జరిగింది. స్నాచర్ ఒక వృద్ధురాలి మెడలో నుంచి మూడు తులాల చైన్ లాక్కెళ్లాడు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిగిలోని హెచ్ఏఎల్ కాలనీ లో చైన్ స్నాచింగ్ జరిగింది. ఇంటిముందు కూర్చున్న వృద్ధురాలు వెంకమ్మ(80) మెడలో నుండి 3తులాల గొలుసునుదుండగుడు లాక్కెళ్లాడు. కాలనీ వాసులు చైన్ స్నాచర్ ను వెంబడించి పట్టుకుని దేహశుద్ధి చేసారు. చైన్ స్నాచింగ్ చేసిన బైక్ ను వదిలి కాలనీవాసుల నుండి నిందితుడు తప్పించుకు పారిపోయాడు. ..

## దేశంలోనే స్కూళ్ల ఫీజుల్లో హై'డర్' బాద్

**హైద్రాబాద్ :** హైదరాబాద్‌లో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల మోత మోగుతోంది. ఎలాంటి నిబంధనలు లేకుండా పాఠశాలలు 40 శాతం నుంచి 100 శాతం వరకు ఫీజులను పెంచుతుండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారు. ఫీజుల పెంపుపై దేశవ్యాప్తంగా అత్యధిక ఫిర్యాదులు హైదరాబాద్ నుంచే వస్తున్నట్లు తెలిపింది. గృహ రుణ ఈఎంఐలతో సమానంగా మారుతున్న స్కూల్ ఫీజుల వల్ల విద్య మధ్యతరగతికి భారంగా మారుతోందని, ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలు పెంచితేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.ఒకప్పుడు విద్య అంటే జ్ఞాన దానం.. నేడు విద్య అంటే లాభసాటి వ్యాపారం. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు చదువును ఒక సేవగా కాకుండా.. లాభాలు తెచ్చిపెట్టే వ్యాపారంగా మార్చేశాయి. ఫీజుల మోత, డొనేషన్ల బాదుడు, పుస్తకాలు-యూనిఫాంల పేరుతో తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతూ అడ్డగోలుగా దోచుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల ఫీజులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో.. ఫీజులకి సంబంధించిన ఫిర్యాదులలో హైదరాబాద్ దేశంలోని అగ్రశ్రేణి నగరాలలో ఒకటిగా నిలిచింది. ఇతర మెట్రో నగరాలలో ఫీజుల పెరుగుదల సాధారణంగా 10 నుంచి 30 శాతం వరకు ఉండగా.. హైదరాబాద్‌లో మాత్రం ఎలాంటి నిబంధనలు లేకపోవడం వల్ల కొన్ని ప్రైవేటు స్కూళ్లు ఏకంగా 40 నుంచి 50 శాతం మేర, కొన్ని సందర్భాల్లో 100 శాతం వరకు ఫీజులను పెంచుతున్నాయని ఇండియన్ వెబ్ ఆఫ్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనుభా సహాయ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని మెజారిటీ తల్లిదండ్రుల నుంచే తమకు అత్యధిక ఫిర్యాదులు అందుతున్నాయని, బెంగళూరు రెండో స్థానంలో ఉందని ఆమె తెలిపారు.చాలా కుటుంబాలకు పాఠశాల విద్య ఖర్చులు హోమ్ లోన్ ఈఎంఐలను తలపించేలా భారంగా మారుతున్నాయన్నారు. ఇటీవల కెనడా నుంచి నగరానికి తిరిగి వచ్చిన ఓ మహిళ మాట్లాడుతూ.. తన ఏడేళ్ల కూతురి స్కూల్ ఫీజు గురించి ఆశ్చర్యకర విషయాలు వెల్లడించారు. ట్రాన్స్‌పోర్టుతో కలుపుకొని ఏడాదికి రూ. 3 లక్షలకు పైగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. తమ ఇంటి లోన్ ఈఎంఐ రూ. 40 వేలు ఉంటే, కూతురి స్కూల్ నెలకు ఫీజు రూ. 22 వేల వరకు ఉందని, 10 ఏళ్ల క్రితంతో పోలిస్తే ఫీజులు ఇంతరా పెరిగిపోవటం తనను ఆశ్చర్యపరిచిందని ఆమె వెల్లడించారు. ఫీజులు విపరీతంగా ఉండటం వల్లే తాము కేంబ్రిడ్జ్ సిలబస్ బదులుగా సీబీఎస్ఈని ఎంచుకోవాల్సి వచ్చిందని చెప్పారు.తమ పిల్లల ఫీజులను ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఒక్కసారిగా భారీగా పెంచేసిందని పేట్‌బషీరాబాద్‌కు చెందిన మరో మహిళ వాపోయారు. గతేడాది ప్రైమరీ చదువుతున్న ఇద్దరు పిల్లలకు వరుసగా రూ. 23 వేలు, రూ. 22 వేలు చెల్లిస్తే.. ఈ ఏడాది ఆ ఫీజులు రూ. 40 వేలు, రూ. 58 వేలకు పెంచినట్లు తెలిపారు. రసీదుల ఆధారంగా ఒకరి ఫీజు సుమారు 74 శాతం పెరిగితే.. మరో అబ్బాయికి ఏకంగా 164 శాతం పెరిగిందని దీనివల్ల తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు.ఈ రకమైన ధోరణి కారణంగా విద్య అప్పర్ మిడిల్ క్లాస్ మినహా ఇతరులకు అందని ద్రాక్షలా మారుతోందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, విద్యావేత్త ఆకునూరి మురళి ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది కుటుంబాలు తమ నెలవారీ ఆదాయంలో 50 శాతాన్ని స్కూల్ ఫీజులకే ఖర్చు చేస్తున్నాయని, మంచి ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలనే ఉద్దేశంతో గిగ్ కార్మికులు కూడా రెట్టింపు కష్టపడి సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వాలు విద్యకు తక్కువ బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే ప్రజలు ప్రైవేట్ స్కూళ్ల వైపు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ విద్యా కమిషన్ సూచనలు అమలవకపోవటం దురదృష్టకరమని అన్నారు.

## అనర్హులకు డబుల్ బెడ్ రూములు ఇస్తున్నారు

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**హైదరాబాద్ :** డబుల్ బెడ్ రూంలు నిరుపేదలకు ఇవ్వకుండా మంత్రుల కలెక్టర్ల అనుచరులను ఇవ్వడంపై కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. దేశంలో ప్రజలను నిత్యం మోసం చేసే పార్టీనే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టరాజ్యానికి పాల్పడుతోంది. ఖైతలాపూర్ లో కేసీఆర్ ప్రభుత్వంలో 145 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించారు.నాలా పక్కన జీవిస్తున్న అమృత్ నగర్ తండా వాసులకు ఇవ్వాలని డిమాండ్ చేశాం. నిరుపేదలై విలేకరులకు ఇండ్లు ఇవ్వాలని కలెక్టర్ కి వినతిపత్రం అందించాం. హౌసింగ్ బోర్డు వీసీ తరుపున ఒకరికి డబుల్ బెడ్ ఇచ్చారు. హైదరాబాద్ రంగారెడ్డి కలెక్టర్ తరుపున మరొకరికి డబుల్ బెడ్ రూం. ఖమ్మం లో నివసిస్తున్న మహిళకు కూకట్ పల్లి లో డబుల్ బెడ్ రూం ఇచ్చారని అన్నారు.

## బిజెపి ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ -- బిఎల్ఓలు, నాయకులకు ఘన సత్కారం

ప్రజాక్షేత్రంలో బిజెపి.. తల్లాడ పరిధిలో విస్తృతంగా పర్యటించిన నున్న రవికుమార్



**నవగీతం, (తల్లాడ ప్రతినిధి):** సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తల్లాడ మండలం నారాయణపురం, కొడవటిమెట్ట తదితర గ్రామాల్లో బిజెపి ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలేరు అసెంబ్లీ బిజెపి నాయకులు నున్న రవికుమార్ పాల్గొని బూత్ స్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన 19వ బూత్ మాజీ ఎంపీటీసీ చల్లా తిరుమలాదేవి, బిఎల్ఏ-2 వేము అశోక్, 20, 22 బూత్ ఇన్-ఛార్జ్ పెరిక కిరణ్ ఇళ్ల వద్ద బిఎల్ఓలు రాయల విజయలక్ష్మి, షేక్ శైలజలను మరియు బిఎల్ఏ-2 వేము అశోక్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందించారు. ?పర్యటనలో భాగంగా తల్లాడ హెచ్‌పి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ముత్యాలమ్మ తల్లి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక బిజెపి కార్యకర్తల ఇళ్ల వద్ద పార్టీ విధానాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిపారు. అలాగే తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు పెరిక స్వర్ణలతను, గోశాల నిర్వాహకులు కొత్త సత్యనారాయణ రెడ్డిని నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు చల్లా నాగులు, ప్రధాన కార్యదర్శులు రాయల్ రమేష్, పెరిక కిరణ్, ట్రెజరర్ యద్దనపూడి శ్రీనివాసరావు, కిసాన్ మోర్చా నేత చోడ నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వేము అశోక్, నరసింహారావు, మహిళా మోర్చా నాయకురాలు నన్నపనేని శారద, బాబురావు, బసిరెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడ వీడీసీ చైర్మన్‌గా రెడ్డెం రామకృష్ణారెడ్డి

ఎంపీడీఓ శ్రీధర్ రాజు సమక్షంలో ఘన సన్మానం



**నవగీతం,(తల్లాడ ప్రతినిధి):** ?తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి కమిటీ (వీడీసీ) నూతన చైర్మన్‌గా నారాయణపురం గ్రామానికి చెందిన రెడ్డెం రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) శ్రీధర్ రాజు సమక్షంలో పంచాయతీ పాలకవర్గం, అధికారులు ఆయనను శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ శ్రీధర్ రాజు మాట్లాడుతూ.. గ్రామ సమగ్ర అభివృద్ధికి నూతన కమిటీ, పంచాయతీ పాలకవర్గం సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.?సన్మానంతరం నూతన చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, తల్లాడను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి), ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి (ఈవో) హరికృష్ణ, వార్డు సభ్యులు సరికొండ శ్రీనివాసరాజు, కమాల్, దోనెజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే నివేదిక సమర్పణలో సత్తుపల్లి జిల్లాలోనే ద్వితీయ స్థానం

పార్టీ బలోపేతానికి, సంక్షేమ పథకాల విస్తరణకు క్షేత్రస్థాయి ప్రతినిధులే మూలస్తంభాలు: ఎమ్మెల్యే రాగమయి దయానంద్



**నవగీతం,(తల్లాడ ప్రతినిధి):** ?సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా సర్వే ప్రక్రియ తొంబై శాతం పూర్తికావడంపై ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, శాసనసభ్యురాలు డాక్టర్ రాగమయి దయానంద్ హర్షం వ్యక్తం చేశారు. తల్లాడ మండలం పరిధిలోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యురాలు మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడంలో బూత్ స్థాయి ప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని జిల్లాలోనే రెండవ స్థానంలో నిలిపిన ప్రతినిధులను, నియోజకవర్గ బాధ్యుడు రాయల రామును ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా అభినందించారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో సర్వే ప్రక్రియను నూరు శాతం పూర్తి చేసిన మొదటి వందమంది ప్రతినిధులకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు అగ్రనేత రాహుల్ గాంధీని కలిసే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా నాయకులు, కార్యకర్తలు ఇదే సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవగీతం తెలుగు దినపత్రిక
బుధవారం
29 జూలై 2026

## గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను ప్రాధాన్యతగా తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలి

చెత్తను నాలుగు రకాలుగా వర్గీకరించే విధానంపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలి

వీబీజీఆర్ఏఎం నిధులతో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి





**నవగీతం,జగిత్యాల ప్రతినిధి** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకొని సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను, సర్పంచ్ లను ఆదేశించారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, గ్రామీణ పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వీబీజీఆర్ఏఎం నిధుల వినియోగంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల సిద్ధిపేట, ఖమ్మం జిల్లాల్లో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ప్రారంభమయ్యాయని, భవిష్యత్తులో జగిత్యాల జిల్లాలో కూడా ప్రత్యేక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను సుప్రీంకోర్టు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోందని, సుప్రీంకోర్టు తాజా తీర్పుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా, వాటి అమలుపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతి వారం అఫిడవిట్ సమర్పిస్తున్నారని తెలిపారు. అందువల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లను కేవలం ప్రదర్శన కోసమే కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో పొడి వ్యర్థాలు తడి వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వైద్య వ్యర్థాలు అనే నాలుగు రకాలుగా చెత్తను వర్గీకరించే విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. ప్రతి కుటుంబానికి చెత్తను వేర్వేరుగా అందించే అలవాటు ఏర్పడేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నాలుగు రకాల వ్యర్థాల సేకరణ, నిర్వహణకు అవసరమైన డంపింగ్ ప్రదేశాలను జిల్లా యంత్రాంగం గుర్తిస్తోందని, వాటి సేకరణకు అవసరమైన సామగ్రిని గ్రామపంచాయతీలపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. రాబోయే ఒక నెల రోజుల పాటు గ్రామసభలు నిర్వహిస్తూ నిత్య చెత్త సేకరణ, చెత్త వర్గీకరణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం వర్గీకరించని చెత్తను సేకరించబోమనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విధానం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే అమలు చేయబడుతోందని స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మండల అభివృద్ధి అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.వీబీజీఆర్ఏఎం నిధులను కేవలం రహదారులు, డ్రైన్ల నిర్మాణానికే పరిమితం చేయకుండా గ్రామాలకు శాశ్వత ప్రయోజనం చేకూర్చే పాఠశాల ప్రహరీ గోడలు, గ్రామపంచాయతీ భవనాలు, సైన్స్ ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతులు, శాశ్వత భవనాల నిర్మాణానికి వినియోగించాలని సూచించారు. సర్పంచ్‌ల పదవీకాలం చివరి సంవత్సరంలో పనులు ప్రారంభిస్తే పూర్తిచేయడం కష్టమవుతుందని, ఇప్పటి నుంచే గ్రామాభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి శాశ్వత ఆస్తుల సృష్టికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపిడివో రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్ లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం లో పూడూరు రైతుకు మంత్రి ఘన సన్మానం



**నవగీతం, (కొడిమ్యాల ప్రతినిధి):** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "రైతు నేస్తం" కార్యక్రమం 100వ ఎపిసోడ్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానాన్ని చేరవేయడంలో రైతు నేస్తం కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యతనిస్తూ ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నీటి యాజమాన్యం, సమగ్ర పంట సంరక్షణ పద్ధతులను రైతులు అవలంబించాలని పిలుపునిచ్చారు.100వ ఎపిసోడ్ సందర్భంగా కార్యక్రమానికి నిరంతరం హాజరవుతున్న రైతులను మంత్రి ప్రత్యేకంగా సన్మానించారు.ఇందులో పూడూరు గ్రామానికి చెందిన రైతు వెలుముల రామిరెడ్డి సన్మానం అందుకున్నారు.అనంతరం మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి రైతులతో సమావేశమై ఎల్‌నినో ప్రభావం, ఆరుతడి పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన సీడ్ మేళాలో కందులు,కూరగాయల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు.మండల ఉద్యాన అధికారి మంజువాణి ఆయిల్ పామ్, కూరగాయల సాగుపై రైతులకు వివరించారు.ఆయిల్ పామ్ సాగులో విజయవంతమైన రైతులు గుమ్మడిదరి వెంకట్, పడాల దేవేందర్ ను సన్మానించి, వారి అనుభవాలను రైతులతో పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రీలత, గ్రీష్మ, హెచ్ఈవో అనిల్, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకవాగును పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు



**నవగీతం,(ములుగు జిల్లా ప్రతినిధి)** వాజేడు మండలంలోని ఇసుకవాగును స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు పరిశీలించారు. గత వారంలో కురిసిన వర్షాల కారణంగా ఇసుక వాగు తాత్కాలిక రోడ్డు వరదలో పూర్తిగా కొట్టుకుపోయిన సంగతి అందరికీ తెలిసిందే. ఈయెక్క ఇసుకవాగుపై మరలా తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసి ప్రస్తుతం రాకపోకలు జరుగుతుండగా రాబోయే వర్షాకాలం లో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయం పై ఇంజినీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి, ఇసుకవాగుకు సంబంధించిన పరిస్థితులు, అవసరమైన చర్యలపై చర్చించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## మేడారం తరహాలో నేల కూలిన చెట్లు

సహాయ చర్యలు చేపట్టిన నాయకులు పోలీసులు



**నవగీతం,(ములుగు జిల్లా ప్రతినిధి)** మంగపేట మండలం కోమటిపల్లి వెళ్లే దారిలో మంగళవారం సాయంత్రం ఒక్క సారిగా వీచిన బలమైన గాలులకు భారీ వృక్షాలు రోడ్డు పక్కన కింద పడ్డాయి.సంద్రో ని ఒర్రె దాటి శాంతి నగర్‌కు వెళ్లే రహదారి సమీపంలోని అటవీ ప్రాంతంలో మహా వృక్షాలు నేల కూలాయి.చెట్లు రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ లాంటి సంఘటన 2024 ఆగస్టు 31న తాడ్వాయి మండలం మేడారం అటవీ ప్రాంతంలో వచ్చిన గాలులకు అక్కడ చాల చెట్లు నేలకొరిగిన ఘటనను తలపించిందని స్థాని కులు పేర్కొన్నారు. సమాచారం అందు కున్న పోలీసులు కాంగ్రెస్ నాయకులు సంఘటన స్థలానికి చేరుకుని రహదారిపై పడిపోయిన చెట్లను జేసీబీ సహాయంతో తొలగించే చర్యలు చేపట్టారు.

## రాఘవపేట లో పామ్ పౌండ్ నిర్మాణానికి భూమి పూజ



**నవగీతం, మల్లాపూర్ ప్రతినిధి:**మల్లాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామంలో వీబీజీ రామ్ జి పథకంలో భాగంగా మద్దెల నర్సయ్య మామిడి తోటలో వ్యక్తిగత పామ్ పౌండ్ నిర్మాణానికి ఏపిఓ సతీష్ తో కలిసి సర్పంచ్ తోట శ్రీనివాస్ ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిస్టాత్మకంగా చేపట్టిన ఈ యొక్క ఫామ్ ఫాండ్ రైతులందరు నిర్మించుకోవాలని దీని ద్వారా భూర్భజలాలు పెరిగి మన పంటల సాగుకు ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి మోహన్ నాయక్, టెక్నీకల్ అసిస్టెంట్ సరిత, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య బిఆర్ఎస్వీ నాయకులు బైరి రవికుమార్ యాదవ్, బీఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుద్దు రాజకుమార్, భాపురపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.





**నవగీతం,(ములుగు జిల్లా ప్రతినిధి)** ములుగు జిల్లా వాజేడు మండలంలో మంగళ వారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండలంలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తెల్లం మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ అధికారులు వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు అవసరమైన సేవలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, పట్టణ బీజేపీ ఎస్ఐఆర్ ఇంచార్జి మ్యాదరి అశోక్



**నవగీతం, జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాల పట్టణంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, పట్టణ బీజేపీ ఎస్ఐఆర్ ఇంచార్జి మ్యాదరి అశోక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చిరునామా సవరణలు, తొలగింపులు వంటి అంశాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు.ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ ఓటరు వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి కార్యకర్తలు, ఎన్నికల అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని మ్యాదరి అశోక్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్‌తో పాటు పార్టీ నాయకులు గంగం ప్రవీణ్, పుల్ల రమేష్, సుమన్, మహేష్, సుగుణాకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ముగిసిన వినియోగానికి పనికిరాని కంప్యూటర్ ఆర్టికల్స్ బహిరంగ వేలం



**నవగీతం, జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వినియోగానికి పనికిరాని విద్యుత్, కంప్యూటర్ ఆర్టికల్స్ బహిరంగ వేలం పారదర్శకంగా ముగిసింది. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ చేతన్ నితిన్ పర్యవేక్షణలో యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించారు. ఈ ప్రక్రియ ద్వారా వచ్చిన మొత్తం ఆదాయాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఖాతాలో జమ చేయనున్నట్లు అదనపు ఎస్పీ చేతన్ నితిన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్,వేణు, సైదులు, ఐటి కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఎస్ఐలు మరియు కొనుగోలుదారులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిగా దగ్గుబాటి పేరు...

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. విద్యావ్యవస్థలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేశారు. ఇందులో యాదృచ్ఛికం ఏంటంటే.. స్వతహాగా విద్యార్థి నాయకుడిగా ఉండేవారు ధర్మేంద్ర ప్రధాన్. ఇప్పుడు అదే విద్యార్థి లోకం ఆందోళనల ఫలితంగా పదవికి దూరమయ్యారు. ఈ విషయాన్ని పక్కన పెడితే ఇప్పుడు తదుపరి కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎవరు అనే చర్చ బలంగా నడుస్తోంది. అయితే ఈసారి సమర్థులకు అవకాశం ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారు. క్యాబినెట్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తున్నారు. అందులో భాగంగా ఏపీ నుంచి ఈసారి అవకాశం ఉంటుంది అనేది ప్రధానంగా జరుగుతున్న చర్చ. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో ఆమె క్యాబినెట్లో పనిచేసిన అనుభవం ఉండడంతో ఆమె వైపు మోది మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం ఇరకాటంలో పడింది. డ్యామేజ్ కంట్రోల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ సైతం స్పందించారు. పేపర్ లీకేజీ ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేయడంతో పాటు

# బిజినెస్

# జరిమానాలు రూ.7,087 కోట్లు

## జీడీపీ బాగా తగ్గొచ్చు: రాయిటర్స్ సర్వే

**మందగించిన పెట్టుబడులు, పెరుగుతున్న చమురు ధరలతో ఇబ్బందులే**





**బెంగళూరు :** దేశ ఆర్థిక వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) గణనీయంగా పడిపోవచ్చని రాయిటర్స్ పోల్‌లో తేలింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26) భారత జీడీపీ ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ.. ఈసారి మాత్రం మందగించిన పెట్టుబడులు, పెరుగుతున్న చమురు ధరలతో ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయాలను మెజారిటీ ఎకనామిస్టులు వ్యక్తం చేయడం గమనార్హం. వచ్చే ఆర్థిక సంవత్సరం (2027-28) కూడా వృద్ధిరేటు ఆశించిన స్థాయిలో ఉండదని చెప్తుండటం.. ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. ఓవైపు ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్లు క్షీణిస్తున్నాయని, మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభిస్తున్నాయని ఎక్స్‌పర్ట్స్ గుర్తుచేస్తున్నారు. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో పెరిగే క్రూడాయిల్ రేట్లు.. ఎకానమీ వృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయని చెప్తున్నారు. అదుపు తప్పుతున్న ద్రవ్యోల్బణం, మార్కెట్‌లో పడిపోతున్న డిమాండ్, దిగజారుతున్న వినియోగదారుల కొనుగోలు శక్తి.. అన్నీ ప్రతికూల సంకేతాలుగానే పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 6.6 శాతంగానే ఉండొచ్చని రాయిటర్స్ పోల్‌లో అంచనా. వచ్చే ఆర్థిక సంవత్సరం కూడా 6.8 శాతంగానే ఉండొచ్చని అంటున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం 7.7 శాతంగా ఉన్నది.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు




**న్యూఢిల్లీ :** బంగారం, వెండి ధరలు ఒక్కరోజులో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. సోమవారం భారీగా పెరిగిన ధరలు ఆ మరుసటి రోజూ అంతేస్థాయిలో కిందికి పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడం, రూపాయి పుంజుకోవడం ధరలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా న్యూ ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.2,640 తగ్గి రూ.1.47 లక్షలకు దిగొచ్చింది. అంతకుముందు రూ.1, 49,640గా ఉన్నదని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. బంగారంతో పాటు వెండి ధరలు భారీగా దిగొచ్చాయి. కిలో వెండి ఏకంగా రూ.5,200 తగ్గి రూ.2,24, 800గా నమోదైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పెరగడంతో మదుపర్లు తమ పెట్టుబడులను అతి విలువైన లోహాల నుంచి ఈక్విటీల వైపు మళ్లించడంతో వీటి ధరలు తగ్గుముఖం పట్టాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఔన్స్ గోల్డ్ ధర 53.40 డాలర్లు లేదా 1.31 శాతం తగ్గి 4,023.50 డాలర్లకు పరిమితమవగా, వెండి 2 శాతం దిగి 57.24 డాలర్లుగా ఉన్నది.

**కనీస నగదు నిల్వల్లేని ఖాతాదారుల నుంచి ఏడాదిలో వసూలు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు**




**న్యూఢిల్లీ :** గత ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు.. కరెంట్/సేవింగ్స్ ఖాతాల్లో కనీస నగదు నిల్వల మొత్తాలను నిర్వహించని కస్టమర్ల నుంచి దాదాపు రూ.7,087 కోట్లు వసూలు చేశాయి. ఇందులో ప్రైవేట్ బ్యాంకులు రూ.4,948.71 కోట్లు, సర్కారీ బ్యాంకులు రూ.2,137.92 కోట్లు కలెక్ట్ చేసినట్టు ఓ ప్రశ్నకుగాను మంగళవారం రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంగా తెలిపారు. దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.1,798.14 కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంక్ (రూ.1,081.33 కోట్లు) ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా (ఆర్బీఐ) వివరాలను మంత్రి పేర్కొన్నారు. అలాగే మొత్తం 19 ప్రైవేట్ రంగ బ్యాంకులు చేసిన వసూళ్లలో హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్‌ల వాటానే 58 శాతంగా ఉన్నట్టు చెప్పారు. అయితే ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ఖాతాలు సహా ఇతర బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్లపై ఈ చార్జీలేవీ పడలేదని స్పష్టం చేశారు. కాగా, గడిచిన 4 ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంకులు ఇలా ఖాతాల్లో కనీస నగదు నిల్వల్లేకపోతే ఖాతాదారుల నుంచి వసూలు చేసిన మొత్తాలు రూ.26, 170.37 కోట్లుగా ఉండటం గమనార్హం.

### రూ.75,000 కోట్ల మోసం

కేంద్ర వస్తు, సేవల పన్ను (సీజీఎస్టీ) అధికారులు.. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.75,000 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) మోసాన్ని గుర్తించారు. అత్యధికంగా గుజరాత్, మహారాష్ట్రల్లోనే చోటుచేసుకోవడం గమనార్హం. ఈ మేరకు సహాయ మంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభకు లిఖితపూర్వకంగా సమాచారమిచ్చారు. ఐరన్ అండ్ స్టీల్, టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్స్, పేపర్ ప్రొడక్ట్స్ప్లైవుడ్, సిమెంట్, కాపర్ వంటి గూడ్స్‌తోపాటు కాంట్రాక్ట్ సర్వీస్, మ్యాన్‌పవర్ సైప్లె సర్వీసెస్, రియల్ ఎస్టేట్ సర్వీసెస్ వంటి సేవల్లోనూ పన్ను ఎగవేతల్ని గుర్తించామని చెప్పుకొచ్చారు. మొత్తం 30,162 కేసులు నమోదయ్యాయని, వీటి విలువ రూ.74,782 కోట్లుగా ఉందని మంత్రి వివరించారు. గుజరాత్‌లో 12,511 కేసులు (రూ.12,633 కోట్లు), మహారాష్ట్రలో 9,629 కేసులు (18,320 కోట్లు) నమోదయ్యాయి. ఇక మొత్తంగా 2025-26లో 358 మంది అరెస్టయ్యారు.

### క్షీణించిన ఎఫ్‌డీఐలు

గత కొన్నేండ్లుగా దేశంలోకి నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గుతున్నాయని పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా వెల్లడించారు. 2022-23లో 27.99 బిలియన్ డాలర్లుగా ఉంటే.. 2025-26లో 6.95 బిలియన్ డాలర్లకే పరిమితమైనట్టు రాజ్యసభలో మంత్రి ప్రకటించారు. కాగా, విదేశీ మదుపర్లు తమతమ దేశాలకు పంపుతున్న నిధులు పెరుగడం, అలాగే భారత్ నుంచి పెట్టుబడులను వెనుకకు తీసుకుంటుండటమే కారణమని చెప్పారు. 2023-24లో 10.13 బిలియన్ డాలర్లుగా ఉన్న నికర ఎఫ్‌డీఐ.. 2024-25లో 960 మిలియన్ డాలర్లుగానే ఉన్నట్టు ఆర్బీఐ గణాంకాలను ఊటంకిస్తూ వివరించారు. నిజానికి గత ఆర్థిక సంవత్సరం దేశంలోకి రికార్డు స్థాయిలో 94.84 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. అయితే మళ్లీ 88 బిలియన్ డాలర్లదాకా తరలిపోయాయి.

## హెచ్‌యూఎల్ మరోసారి ధరల పోటు!




**న్యూఢిల్లీ :** హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్) మరోసారి తన ఉత్పత్తుల ధరలను పెంచడానికి సిద్ధమవుతున్నది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నమోదైన ద్రవ్యోల్బణంతో పోలిస్తే సెప్టెంబర్ త్రైమాసికం నాటికి ధరల సూచీ 2-5 శాతం వరకు పెరిగే అవకాశం ఉండటంతో ధరల పెంపు అనివార్యమనిపిస్తున్నదని హెచ్‌యూఎల్ సీఈవో, ఎండీ ప్రియా నాయర్ తెలిపారు. ఇప్పటికే 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఉత్పత్తుల ధరలను 2-5 శాతం వరకు సవరించిన విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా చమురు ధరలు భగ్గుమన్నాయని, దీంతో సంస్థపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పటికే కసరత్తును ప్రారంభించినట్టు చెప్పారు. వీటికితోడు వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ఎల్ నినో ప్రభావంతో అమ్మకాలు పడిపోయే ప్రమాదం ఉన్నదని ఆమె హెచ్చరించారు.

## క్రిప్టో ఇన్వెస్టర్లకు ఊరట.. ఇక ఐటీఆర్ దాఖలు సులభం

**‘ట్యాక్స్‌లిస్ట్’ టూల్‌ను తెచ్చిన వజీర్‌ఎక్స్**



**న్యూఢిల్లీ :** గత కొన్నేండ్లుగా క్రిప్టో కరెన్సీల్లో మదుపు చేసేవారు క్రమేణా పెరుగుతున్నారు. అయితే ఏటా ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్స్ దాఖలు చేయాలంటే మాత్రం వీరికి తిప్పలు తప్పడం లేదు. ఈ క్రమంలోనే భారతీయ క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ వజీర్‌ఎక్స్.. ఓ ఉచిత పన్ను నివేదిక సాధనాన్ని తీసుకొచ్చింది. ఐటీఆర్ దాఖలుకు గడువు తేదీ దగ్గరపడుతున్న క్రమంలో క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడులు పెట్టిన మదుపర్లకు ఊరటనిస్తూ ‘ట్యాక్స్‌లిస్ట్’ పేరిట ఫ్రీ క్రిప్టో ట్యాక్స్ రిపోర్టింగ్ వేదికను మంగళవారం పరిచయం చేసింది. దీంతో ఇక రకరకాల క్రిప్టో ఎక్స్ఛేంజీలలో జరిపిన లావాదేవీలకు సంబంధించి సులువుగానే ఇన్వెస్టర్లు తమ పన్ను నివేదికలను ఈ టూల్ ద్వారా అందుకోవచ్చని వజీర్‌ఎక్స్ చెప్తున్నది. ఏ ఎక్స్ఛేంజ్ నుంచైనాసరే మదుపర్లు తమ లావాదేవీల చరిత్రలను ట్యాక్స్‌లిస్ట్ ప్లాట్‌ఫామ్‌పై అప్‌లోడ్ చేసి లాభాలు, నష్టాలు, చెల్లించాల్సిన పన్ను వివరాల నివేదికలను నిమిషాల్లో పొందవచ్చని ఈ సందర్భంగా వజీర్‌ఎక్స్ తెలిపింది. క్రిప్టో ట్యాక్స్ లెక్కింపును సులభతరం చేసేలా ఈ సాధనాన్ని డిజైన్ చేశామని, ట్యాక్స్‌లిస్ట్ దానంతటదే వర్చువల్ డిజిటల్ అసెట్ (వీడీఏ) సహా అన్నింటి లాభనష్టాలను అంచనా వేసి కచ్చితమైన రిపోర్టును ఇస్తుందన్నది.

# భళా షర్మిల.. అదరహో అజయ్..

**పారా షాట్‌పుట్‌లో పసిడితో ధన్‌ఖడ్ కొత్త చరిత్ర**

**ఏపీ లిఫ్టర్ అజయ్, హర్జిందర్, హై జంపర్ సర్వేశ్‌కు రజతాలు**

**శిల్పకు కాంస్యం.. తండ్రిని మించిన కొడుకు**




గ్లాస్గో : పోలియో రాకసి రూపంలో వచ్చిన వైకల్యాన్ని.. పెండ్లి రూపంలో ఎదురైన కష్టాలను అధిగమించి క్రీడలకు రిటైర్మెంట్ ఇచ్చే 34 ఏండ్ల లేటు వయసులో కెరీర్ ఆరంభించిన ధీర వనిత షర్మిల ధన్‌ఖడ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కొత్త చరిత్ర సృష్టించింది. మెగా గేమ్స్ చరిత్రలో పారా అథ్లెటిక్స్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించిన క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. మహిళల పారా షాట్‌పుట్‌లో షర్మిల స్వర్ణం గెలవగా.. ఇదే పోటీలో శిల్పా శైలా కాంస్యంతో మురిసింది. ఇంకోవైపు తండ్రి బాటలో పయనించిన తెలుగు వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు, హై జంపర్ సర్వేశ్ కుశారే రజతాలతో మెరడంతో కామన్వెల్త్‌తో భారత పతకాల సంఖ్య పదికి చేరింది. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఎఫ్57 కేటగిరీ మహిళల షాట్‌పుట్‌లో షర్మిల గుండును 9.81 మీటర్ల దూరం విసిరి గోల్డ్ సొంతం చేసుకుంది. 20 ఏండ్ల కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్ చరిత్రలో భారత్‌కు ఇదే తొలి పసిడి కావడం విశేషం. శిల్ప 7.26 మీటర్ల త్రో చేసి కాంస్యం అందుకుంది. తొలుత నైజీరియాకు చెందిన యుకారియా ఇయాజీ మూడో స్థానంలో నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. అయితే, భారత్ నిరసనతో నిర్వహించిన రివ్యూలో నైజీరియా అథ్లెట్ ఫౌల్ చేసినట్టు తేలడంతో శిల్పకే కాంస్యం దక్కింది. ఇక, పురుషుల హైజంప్‌లో కొద్దిలో స్వర్ణం చేజార్చుకున్న సర్వేశ్ కుశారే రజతం అందుకున్నాడు. హోరాహోరీగా సాగిన పోటీలో సర్వేశ్, జమైకా జంపర్ రొమైన్ బెక్‌ఫోర్డ్ ఇద్దరూ 2.25 మీటర్లు ఎత్తు దూకారు. కానీ, 2.28 మార్కును అధిగమించలేకపోయారు. విజేతను తేల్చేందుకు అంతకుముందు చేసిన ప్రయత్నాల్లో ఇద్దరు అథ్లెట్ల వైఫల్యాలను (కౌంట్ బ్యాక్) లెక్కించారు. ఒకేసారి విఫలమైన బెక్‌ఫోర్డ్ స్వర్ణం అందుకోగా.. రెండు ప్రయత్నాల్లో ఫెయిలైన సర్వేశ్ రజతంతో సంతృప్తి చెందాడు. అయినా కామన్వెల్త్ గేమ్స్ హైజంప్‌లో సిల్వర్ నెగ్గిన భారత అథ్లెట్‌గా రికార్డు సృష్టించాడు.

**ఒక్క కేజీ తేడాతో అజయ్‌కు గోల్డ్ మిస్**

ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు పురుషుల 79కేజీ కేటగిరీలో సిల్వర్ నెగ్గాడు. 21 ఏండ్ల అజయ్ ఫైనల్లో మొత్తం 330 కిలోల బరువెత్తి రెండో స్థానం సాధించాడు. 145 కిలోలతో స్నాచ్‌ను ఆరంభించిన అజయ్ రెండో ప్రయత్నంలో విఫలమైనా చివరగా 149కిలోల బరువు మోసి గేమ్స్ రికార్డు సృష్టించాడు. క్లీన్ అండ్ జర్క్‌లో గోల్డ్ ఫేవరేట్‌గా బరిలోకి దిగాడు. 181 కేజీలను క్లియర్ చేసినా ఒక్క కిలో తేడాతో కొద్దిలో స్వర్ణం కోల్పోయాడు. మలేసియాకు చెందిన ఎరీ హిదాయత్ మొత్తం 331 (147o184) కేజీలతో పసిడి సొంతం చేసుకోగా.. ఇంగ్లండ్ లిఫ్టర్ క్రిస్ మర్రే (325 కేజీ) కాంస్యం అందుకున్నాడు. కాగా, మహిళల 63 కిలోల విభాగంలో నిరుపమ నిరాశపరిచింది.

**విధిరాతను ఎదిరించి.. స్వర్ణ చరిత్రను లిఖించి**

ఒకవైపు వైకల్యం.. మరోవైపు నరకం చూపించే గృహ హింస.. ఇంకోవైపు ఇద్దరు చిన్నారులతో వీధిపాలైన దయనీయ స్థితి. ఇక ఈ జీవితం ముగిసిపోయింది.. ఆత్మహత్యే శరణ్యం అని అనుకున్న అత్యంత చీకటి క్షణంలో ఆమె ఒక ఓ నిర్ణయం తీసుకుంది. ‘నా జీవితానికి మరో అవకాశం ఎందుకు ఇవ్వకూడదు?’ అని తన్నుకొచ్చిన ఆ ఆలోచనే ఆమె భవితవ్యాన్నే మార్చేసింది. చావు అంచున నిలబడి బతుక్కి రెండో చాన్స్ ఇచ్చిన ఆ నిర్ణయమే హర్యానాకు చెందిన 42 ఏండ్ల షర్మిల ధన్‌ఖడ్ కామన్వెల్త్ గేమ్స్ పారా అథ్లెటిక్స్‌లో పసిడి పతకం నెగ్గేలా చేసింది. హర్యానాలోని మహేందర్‌గఢ్ జిల్లా చిత్రౌలి గ్రామంలో నిరుపేద రైతు కుటుంబంలో జన్మించింది షర్మిల.

తల్లి చూపులేనిది కావడంతో బాల్యం నుంచే కష్టాలు చవిచూసింది. రెండేండ్ల వయసులోనే తీవ్రమైన జ్వరం రాగా, సరైన వైద్యం అందక ఎడమ కాలు పోలియో బారిన పడింది. పదో తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పిన ఆమెకు 19 ఏండ్లకే పెళ్లి చే03శారు. అదనపు కట్నం తెమ్మంటూ భర్త తీవ్రంగా వేధించేవాడు. ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చిందనే కోపంతో ఓ రోజు రాత్రి 11 నుంచి 3 గంటల దాకా చితకబాది, ఇద్దరు పసిపాపలతో సహా రోడ్డుపైకి తోసేశాడు. కనీసం బస్సు చార్జీలకు కూడా డబ్బులు లేని దయనీయ స్థితిలో షర్మిల ఆత్మహత్య చేసుకోవాలని భావించినా.. పిల్లల కోసం బతకాలని నిర్ణయించుకుంది. వారి పోషణ కోసం ఇండ్లలో పనులతో పాటు సెక్యూరిటీ గార్డుగా, స్వీపర్‌గా పనిచేసింది. ఇన్ని కష్టాల నడుమ వ్యాపారవేత్త అజిత్ సింగ్ రూపంలో ఆమెకు ఓ చేయూత లభించింది. అజిత్‌తో రెండో వివాహం జరిగాక ఆమె జీవితం మలుపు తిరిగింది. షర్మిల మానసిక దృఢత్వాన్ని, పట్టుదలను గుర్తించిన అజిత్ 2020లో (34 ఏండ్ల వయసులో) ఆమెను పారా అథ్లెటిక్స్ వైపు ప్రోత్సహించాడు. సాధారణంగా క్రీడాకారులు రిటైర్మెంట్ ప్రకటించే వయసులో షర్మిల తొలిసారి చేతిలోకి షాట్‌పుట్ గుండును పట్టింది. కోచ్‌లు టెక్ చంద్, దేవేంద్ర పర్యవేక్షణలో కఠిన సాధన చేసింది. ఆమె శిక్షణ, డైట్ ఖర్చుల కోసం కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తట్టుకుంటూ 2023లో తమ సొంతింటిని కూడా అమ్మేసి అద్దె ఇంట్లోకి మారింది. 2022 కామన్వెల్త్ గేమ్స్, 2023 ఆసియా పారా గేమ్స్‌లో నాలుగో స్థానంతో తృటిలో పతకాలు చేజారినా షర్మిల వెనకడుగు వేయలేదు. పట్టువదలకుండా శ్రమించి, గ్లాస్గో వేదికగా తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కష్టాలు వచ్చినా జీవితం అక్కడితో ముగిసిపోదని షర్మిల ఈ విజయంతో నిరూపించింది. విధిరాతను ఎదిరిస్తూ.. జీవితానికి రెండో అవకాశం ఇస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ప్రపంచానికి చాటిచెప్పింది.

**తండ్రిని మించిన కొడుకు**

భారత్ ఆతిథ్యం ఇచ్చిన 2010 ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్‌లో ఏపీ లిఫ్టర్ శ్రీనివాసరావు 56 కేజీల విభాగంలో కాంస్య పతకం గెలవగా.. 16 ఏండ్ల తర్వాత అతని కొడుకు అజయ్ బాబు మరో అడుగు ముందుకు వేసి రజత పతకంతో తండ్రిని మించిన తనయుడు అనిపించుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా కొండవెలగాడ గ్రామానికి చెందిన అజయ్‌కు ఆరేండ్ల వయసు ఉన్నప్పుడు శ్రీనివాసరావు కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్యం గెలిచాడు. ఆ రోజు ఊరంతా తమ ఇంట్లో టీవీకి అతుక్కుపోయి సంబరాలు చేసుకోవడం, ఆ పతకం తమ కుటుంబ ఆర్థిక కష్టాలను తీర్చడం అజయ్ చిన్నతనంలోనే చూశాడు. తండ్రి బాటలోనే క్రీడాకారుడిగా ప్రయాణం ప్రారంభించాడు. శ్రీనివాసరావు స్వయంగా కొడుకుకు శిక్షణ ఇచ్చి వెయిట్‌లిఫ్టింగ్ మెళకువలు నేర్పించాడు. ఆరంభంలో తీవ్ర ఒత్తిడికి గురై జాతీయ టోర్నీల్లో విఫలమైనా.. 2024లో మోచేతి గాయంతో ఆటకు దూరమైనా తండ్రి అందించిన మనోధైర్యంతో అజయ్ మళ్లీ పుంజుకున్నాడు. గతేడాది కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో 335 కేజీలు ఎత్తి స్వర్ణం సాధించి సత్తా చాటాడు. ఇప్పుడు కామన్వెల్త్ గేమ్స్ రజతంతో మరో మెట్టుఎక్కాడు.

# స్పోర్ట్స్

## 5 ఓవర్లు మెయిడిన్లు వికెట్లు

**విండీస్ బౌలర్ గ్రీవ్స్ రికార్డు ప్రదర్శనకు పాక్ కుదేలు**



**ట్రినిడాడ్ :** స్వదేశంలో పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో వెస్టిండీస్ పేసర్ జస్టిన్ గ్రీవ్స్ (5/27)రికార్డు ప్రదర్శనతో ప్రత్యర్థి బ్యాటింగ్ లైనప్‌ను గజగజ వణికించాడు. వరుసగా ఐదు ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా 5 వికెట్లు పడగొట్టి పాక్ వెన్నువిరిచాడు. గ్రీవ్స్ పేస్ మ్యాజిక్‌తో తొలి ఇన్నింగ్స్ ఒక దశలో 62.5 ఓవర్లకు 244/3తో ఉన్న పాక్.. ఏడు ఓవర్ల వ్యవధిలోనే ఆరు వికెట్లు కోల్పోయి 267/9తో నిలిచింది. 64వ ఓవర్లో బంతినందుకున్న గ్రీవ్స్.. మొదట షాన్ మసూద్ (109)ను ఔట్ చేసి పాక్ పతనానికి శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత వరుస ఓవర్లలో అలి ఉస్మాన్, జమాల్, రిజ్వాన్, అబ్బాస్‌ను ఔట్ చేసి తన కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో వరుసగా ఐదు ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డులకెక్కాడు.

## సోనమ్ జోడీకి కాంస్యం



**హాంగ్జౌ :** ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీ సోనమ్-హిమాన్షు కాంస్యం గెలిచింది. ఫైనల్‌లో భారత జంట 441.2 పాయింట్లు సాధించగా చైనాకు స్వర్ణం, రజతం దక్కాయి. ఈ టోర్నీలో ఇప్పటిదాకా భారత్ ఒక స్వర్ణం, ఒక రజతంతో పాటు రెండు కాంస్యాలతో నాలుగు పతకాలు సాధించి పట్టికలో మూడో స్థానంలో ఉంది.

నవగీతం
తెలుగు దినపత్రిక
బుధవారం
29 జూలై 2026



# సిత్తరాల నవ్వు.. సిలకల్లే నువ్వు..

తిరువీర్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'భగవంతుడు'. జి.జి.విహారి దర్శకుడు. రవి పనస ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై రవి పనస ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవలే ఈ చిత్రం నుంచి రెండో పాట 'సిత్తరాల నవ్వు' విడుదలైంది. కృష్ణప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు జి.జి.విహారి సాహిత్యాన్ని అందించారు. జావెద్ అలీ ఆలపించారు. 'సిత్తరాల నవ్వు..అరే సిలకల్లే నువ్వు, చేమంతి పువ్వు, నీలాల కళ్లు..' అంటూ కథానాయిక అందాన్ని వర్ణిస్తూ ఈ పాట సాగింది. పల్లెటూరి నేపథ్యంలో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: కె.పి, కథ, దర్శకత్వం: జి.జి.విహారి.

# చిట్టి చేతులతో అయ్యో రామా..



దుల్కర్ సల్మాన్ మలయాళంలో పెద్ద స్టార్. అలాగే తెలుగు ప్రేక్షకులకూ అభిమాన నటుడు. దుల్కర్ తెలుగులో నేరుగా చేసిన మహానటి, సీతారామం, లక్కీభాస్కర్ చిత్రాలు వసూళ్ల పరంగా వందకోట్ల మార్కును దాటాయి. ఇప్పుడున్న ఏ పరభాషా నటుడికీ దక్కని రికార్డ్ ఇది. ప్రస్తుతం ఆయన తెలుగులో 'ఆకాశంలో ఒక తార' అనే సినిమా చేస్తున్నారు. శ్రుతిహాసన్, సాత్విక వీరవల్లి కథానాయికలు. పవన్ సాదినేని దర్శకుడు. సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మాతలు. మంగళవారం దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు. 'చిట్టి చిట్టి చీమ.. చిట్టి చేతుల్తో అయ్యో రామా.. వంద టన్నుల చెక్కెర మోస్తుందమ్మా..' అంటూ సాగే ఈ పాటను శ్రీమణి రాయగా, జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరిచారు. రమ్య బెహరా ఆలపించారు. కథలోని సారాంశాన్ని ఈ పాట సాహిత్యంలో మిళితం చేసి రాసినట్టుగా హీరోయిన్ కోణంలో ఈపాట సాగింది. నక్షత్రాలను తాకాలని కలలు కనే ఓ అమ్మాయి కలను, ఆమె పక్కనే నిలబడి నిశ్శబ్దంగా అండగా నిలిచే అబ్బాయి ప్రేమను ఈ పాట ప్రతిబింబిస్తున్నది. సంప్రదాయ ప్రేమకథలకు భిన్నంగా, ఒక ప్రత్యేకమైన బంధాలను ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.

# ఆరు నెలలు నాతో మాట్లాడలేదు

'లెనిన్'తో ఎట్టకేలకు హిట్ ట్రాక్ ఎక్కేసింది పూణే పూబోణి భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం 'లెనిన్' సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తూ, మరోవైపు తమిళంలో శివకార్తికేయన్ సరసన 'సియోన్' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నది ఈ అందాలభామ. తాజాగా ఓ కళాశాల విద్యార్థులతో టాక్ షోలో ముచ్చటించిన భాగ్యశ్రీ.. తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నది. 'నాకు నటనంటే ఇష్టం. నటిని కావడం నా గోల్. కెరీర్ విషయంలో మన నిర్ణయాన్ని మన మనస్సాక్షి అంగీకరించినప్పుడు, ఇక ఏ విషయంలోనూ రాజీ పడాల్సిన అవసరం లేదు. ఒకవేళ రాజీ పడాల్సివస్తే, మనకు మనమే పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. అందుకే నా నిర్ణయాన్ని నేరుగా అమ్మకు ఫోన్ చేసి చెప్పాను. 'వద్దు' అనింది. నాన్నకు ఫోన్ చేస్తే 'అమ్మ వద్దన్న పని ఎలా చేస్తావ్?' అని ప్రశ్నించారు. అక్క అయినా మద్దతుగా నిలుస్తుందనుకుంటే.. 'అమ్మ నాన్న వద్దంటున్నారు కదా?' అనేసింది. ఇలా అంతా 'నో' చెప్పేశారు. కానీ నేను మాత్రం వెనక్కి తగ్గలేదు. ఆడిషన్స్‌కి వెళ్లిపోయా. దీంతో ఇంట్లో వాతావరణం వేడెక్కింది. మా అమ్మ ఆరు నెలలు నాతో మాట్లాడ్లేదు. నన్ను వాట్సాప్‌లో కూడా బ్లాక్ చేసింది. ఇప్పుడు ఈ విషయాన్ని నవ్వుతూ చెబుతున్నాను కానీ.. అప్పుడు మాత్రం చాలా బాధపడ్డా' అంటూ తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నది భాగ్యశ్రీ బోర్సే.






# సిరీస్ చూసి చిరంజీవి మెచ్చుకున్నారు

శ్రీకాంత్ ప్రధాన పాత్ర పోషించిన వెబ్ సిరీస్ 'అబ్జెక్షన్ మై లార్డ్'. 'నోటరీ పరశురాం' అనేది ఉపశీర్షిక. అనన్యశర్మ, ముఖేష్‌రుషి, స్నేహాల్, సమీర్ కీలక పాత్రధారులు. సంతోష్ అయ్యప్పన్ దర్శకుడు. రాజ్‌కుమార్ ఆకెళ్ల నిర్మాత. 7 ఎపిసోడ్స్‌తో ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ ఈ నెల 31 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో స్ట్రీమింగ్ కానున్నది. తాజాగా హైదరాబాద్‌లో ఈ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్‌ని నిర్వహించారు. 'దర్శకుడు క్లారిటీతో ఈ సిరీస్ తెరకెక్కించారు. ఇందులో నాకు మంచి పాత్ర దొరికింది. టోటల్ అవుట్‌పుట్ చూశాక ఫిదా అయ్యాం. ప్రతి పాత్రలోనూ మంచి ఎలివేషన్ ఉంటుంది. చిరంజీవి ఈ సిరీస్ చూసి బావుందని మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మా టీమ్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను' అని నటుడు శ్రీకాంత్ అన్నారు. దర్శకుడు సంతోష్ అయ్యప్పన్ మాట్లాడుతూ 'కేవలం 19రోజుల్లో ఈ సిరీస్ షూటింగ్ పూర్తి చేశాం. టీమ్ అంతా సహకరించడం వల్లే ఇది సాధ్యమైంది. ఈ సిరీస్ సూపర్ సక్సెస్ అవుతుంది' అని నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత రాజ్‌కుమార్ ఆకెళ్ల, నటులు ముఖేష్ రిషి, అనన్యశర్మ, సమీర్, నారాయణ హరిచంద్ర, జెమినీ సురేశ్ కూడా మాట్లాడారు.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.